లోపలి పేజీల్లో...
ఎంటీయూ 1262 ధాన్యంపై మిల్లర్ల కిరికిరి 7
గిరిజన మ్యూజియానికి అదనపు హంగులు 7
అనంతారంలో కిడ్నీ రోగులపై కలెక్టర్ ఆరా
రైతు భరోసా ఏదీ: రాష్ట్ర రైతు సంఘం
లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డులు 6

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 17 డిసెంబరు 2024



ఖమ్మంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీవైఎస్‌వో


మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు


స్విమ్మింగ్ పోటీల దృశ్యం..

'సీఎం కప్' కోలాహలం

- జిల్లా స్థాయి క్రీడా పోటీలు షురూ
- లాంఛనంగా ప్రారంభించిన డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి
- 21 మండలాల నుంచి 870 మంది క్రీడాకారుల హాజరు
- ఈ నెల 21వరకు పోటీల నిర్వహణ 6



ధాన్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

చందన్‌కుమార్, ఖమ్మం డీఎస్‌వో

ప్రశ్న: సరిహద్దు ద్వారా ఏపీ ధాన్యం అక్రమంగా వస్తున్నదని ఆరోపణలు వస్తున్నాయి...?

జవాబు: అదేం లేదు. ఆదివారం ఉదయం 31లారీలు ఏపీ నుంచి వస్తుండగా అడ్డుకున్నాం. వాటిని తిప్పి పంపించి వేశాం. అయితే రైతుల పేరుతో అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్ర: ఇప్పటికే ఇలా అక్రమంగా ధాన్యం జిల్లాకు వచ్చిందని, బోనస్‌ను కూడా తీసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి..?

జ: అదేం లేదు. సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేయడం వల్లనే ఆదివారం లారీలు పట్టుకోగలిగాం. పోలీస్, రెవెన్యూ, మార్కెటింగ్ శాఖలతో సమన్వయం చేసుకుని వీటిని నిరోధిస్తున్నాం.

ప్ర: జిల్లాలో ఇప్పటివరకు ఎంతమేరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు?

జ: ఇప్పటివరకు 344 కేంద్రాల ద్వారా 1,50,142.440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. 1.48 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు ఇప్పటికే తరలించాం.

ప్ర: చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆరోపణలున్నాయి...?

జ: ఇప్పటివరకు రూ.243 కోట్ల చెల్లింపులు చేశాం. ఇంకా రూ.105 కోట్లు చెల్లించాల్సి ఉంది. వాటిని త్వరలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈసారి బోనస్ కింద క్వింటాకు రూ.500 చొప్పున ఇప్పటివరకు రూ.51కోట్ల 64లక్షలు 16,858 మంది రైతులకు చెల్లించాం.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్


కరకగూడెం మండలంలో మంచు దుప్పటిలో పల్లె

చలి పంజా

- 10 సెల్సియస్ డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఖమ్మంలో 10.7, భద్రాద్రిలో 10.4 డిగ్రీల నమోదు
- సాధారణం కంటే 5 డిగ్రీలు తక్కువ
- వణుకుతున్న ఏజెన్సీ పల్లెలు
- ఎక్కడ చూసినా చలిమంటలే
- బయటకు రాలేకపోతున్న జనం
- దైనందిన కార్యకలాపాలకు ఆటంకం

చలి పంజా విసురుతోంది. జనాన్ని గజగజ వణికిస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో జన జీవనం తీవ్రంగా ప్రభావితం అవుతోంది. దైనందిన కార్యకలాపాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. పిల్లలు, వృద్ధులు అనేక రకాల అనారోగ్య సమస్యలకు లోనవుతున్నారు. ఉదయం 10గంటల వరకు జనం కాలు బయట పెట్టలేకపోతున్నారు. సాయంత్రం 5 గంటల నుంచే చలి తీవ్రతతో పాటు మంచు కురుస్తుండటంతో ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ముసుగు తన్ని పడుకుంటున్నారు. స్వెట్లర్లు, రగ్గులు ధరించి బయటకు వస్తున్నారు. పల్లెల్లో ఎక్కడ చూసినా చలిమంటల దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఇక ఏజెన్సీ పల్లెలైతే భరించలేని చల్లదనంతో వణికిపోతున్నాయి.


ఖమ్మం నగరంలో సోమవారం రాత్రి చలిమంట వేసుకున్న యువకులు

ఖమ్మం/కొత్తగూడెం/పాల్వంచ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. గత వారంరోజుల వరకు 15డిగ్రీల పైనే కొనసాగిన ఉష్ణోగ్రతలు... గడిచిన రెండు రోజులుగా గతంలో ఎన్నడూ లేనిస్థాయిలో కనిష్టానికి చేరాయి. మిట్ట మధ్యాహ్నం అవుతున్నప్పటికీ చల్లని గాలుల తీవ్రత తగ్గని పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాతావరణశాఖ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెంలో 10.4 డిగ్రీలు నమోదుకాగా.. గతేడాది 16.5 డిగ్రీలు నమోదైంది. ఖమ్మం జిల్లా కామేపల్లిలో 10.7 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రత నమోదుకాగా.. గతేడాది 16.8 డిగ్రీలు నమోదైంది. ఇక ఖమ్మం జిల్లాలో సగటు సాధారణ ఉష్ణోగ్రత 18.4 డిగ్రీలు ఉండగా.. 13.6 డిగ్రీలు నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సగటు ఉష్ణోగ్రత 18 డిగ్రీలకుగాను 12.4డిగ్రీలు కనిష్టంగా నమోదైంది.

కాగా గడిచిన పదేళ్లకాలంలో అంతటి తక్కువస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదుకావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. రానున్న మూడు రోజులు కూడా ఇదేస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక సోమవారం రాత్రి వాతావరణశాఖ కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆళ్లపల్లిలో 13.4, చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడు, ఓల్డ్ కొత్తగూడెం, పాల్వంచ మండలం సీతారామపట్నం, యానంబైలు, సుజాతనగర్‌లలో 14 డిగ్రీలు, లక్ష్మీదేవిపల్లి, కరకగూడెంలలో 14.3, గుండాలలో 14.5, దమ్మపేట మండలం నాయుడుపేటలో 15.2, అంకపాలెంలో, మండాలపల్లిలలో 15.3, అన్నపురెడ్డిపల్లి, పెంట్లం 15.5, దమ్మపేట మండలం నాగుపల్లిలో 15.6, మల్కారం, ముల్కలపల్లిలో 15.9, ఇల్లెందులో 15.7 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఖమ్మం జిల్లాలో కొణిజర్ల మండలం గుబ్బగుర్తి, సత్తుపల్లి మండలం గంగారంలో 15.6, కామేపల్లి మండలం లింగాలలో 15.7, రఘునాథపాలెం మంచుకొండలో 15.9, కారేపల్లిలో 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా పెరిగిన చలి తీవ్రత కారణంగా ప్రజలు సాయంత్రం వేళ నుంచే బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. చలి, దగ్గు, జ్వరం వంటి సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలతో (మిగతా 6వ పేజీలో)



తస్మాత్ జాగ్రత్త!

- చలిపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రముఖ వైద్యుడు ఎస్.రాంప్రసాద్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత పెరిగింది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం, రాత్రివేళల్లో మంచు కురుస్తోంది. ఈ కాలంలో వృద్ధులు, పిల్లలకు కష్టకాలం. ఏమాత్రం ఆదమరిచినా అనారోగ్యం బారిన పడే అవకాశాలున్నాయి. చిన్నపాటి ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ఇబ్బందులు తలెత్తవని నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు ఎస్.రాంప్రసాద్ (ప్రభుత్వ జిల్లా జనరల్ ఆస్పత్రి) సూచిస్తున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ఈ సీజన్లో అస్తమా, సీవోపీడీ లాంటి సమస్యల వల్ల శ్వాస ఆడకపోవడం ఇతర ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా డస్ట్మైట్స్ పుప్పొడి, పెంపుడు జంతువులు, ఫంగస్ వంటి ఇండోర్ అలర్జీలు అస్తమా సమస్యలను ప్రేరేపిస్తాయి. వీటిపట్ల జాగ్రత్తగా ఉండాలి.

- అధిక చలితో ముక్కు, చెవుల్లో ఇన్ఫెక్షన్లు కూడా వస్తాయి. ఉదయం వాకింగ్‌కు వెళ్లే వాళ్లు ఎండ వచ్చిన తర్వాత చేయడం మంచిది. చెవిలో నొప్పి ఎక్కువగా ఉంటే మాత్రం ఈఎన్టీ నిపుణులకు చూపించాలి.
- చల్లని గాలి, పొడి (మిగతా 6వ పేజీలో)


ముక్కోటి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

ముక్కోటి ఏర్పాట్లు ఘనంగా ఉండాలి..

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ముక్కోటి ఆహ్వాన పత్రికలు, వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



భద్రాచలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 నుంచి భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ముక్కోటి మహోత్సవాలను పురస్కరించుకొని దేవస్థానం రూపొందించిన ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్లను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. సోమవారం హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ ఈ.శ్రీధర్, అడిషనల్ కమిషనర్ కూరాకుల జ్యోతి, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వైదిక పరిపాలన సిబ్బంది సమక్షంలో వాటిని ఆవిష్కరించారు. ముందుగా దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌ల ఆధ్వర్యంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వైదిక పరిపాలన సిబ్బంది మంత్రి సురేఖను కలిశారు. ఈ సమయంలో ఆమెకు వేద ఆశీర్వచనం అందజేసి స్వామి వారి ప్రసాదం, శాలువాను అందజేశారు. అనంతరం ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్లను ఆమె లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ముక్కోటికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు మెచ్చే రీతిలో ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, వేద పండితులు వేన్నాతుల ఆంజనేయ వరప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

ములుగు జిల్లాలోకి పెద్దపులి

- ఊపిరి పీల్చుకున్న భద్రాద్రి జిల్లా ప్రజలు
- 2021లో వచ్చిన రూట్‌లోనే పులి ప్రయాణం
- నర్సాపురం అడవిలో పాద ముద్రలు గుర్తించిన అధికారులు
- ఛత్తీస్‌గఢ్‌లోని టైగర్‌జోన్ నుంచి రాక
- అది ప్రయాణించే మార్గంలో అటవీశాఖ గస్తీ


చిరుమళ్ల అటవీ ప్రాంతంలో సీసీ కెమెరా ఏర్పాటు చేస్తున్న డీఎఫ్‌వో 6

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


- అధ్యక్షుడిగా షేక్ రంజాన్
- ప్రధాన కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు
- జిల్లా కమిటీ సభ్యులుగా 119 మంది
- ఆఫీస్ బేరర్లుగా 19 మంది
- ఆడిట్ కమిటీ సభ్యులుగా ఐదుగురు


షేక్ రంజాన్


పి.నాగేశ్వరరావు

సత్తుపల్లిలో సీపీఎం జిల్లా మహాసభలు

- రేపు ప్రారంభించనున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
- రెండు రోజులపాటు నిర్వహణ...
- 600 మందికి పైగా ప్రతినిధుల రాక
- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వెల్లడి



ఖమ్మం టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీపీఎం 22వ జిల్లా మహాసభలు బుధ, గురువారాల్లో సత్తుపల్లిలో నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం జిల్లా సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలను సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రారంభిస్తారని, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సాయిబాబు హాజరవుతారన్నారు. ఈ మహాసభలకు 600మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు హాజరవుతారన్నారు. గ్రామశాఖ నుంచి జాతీయస్థాయి వరకు ప్రతి మూడేళ్లకు ఒకసారి మహాసభలు నిర్వహించి, (మిగతా 6వ పేజీలో)

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

- పాల్వంచలో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి
- లోనికి నిరాకరించడంతో దుస్తులు విప్పి నిరసన
- పరీక్ష రాస్తుండగా మరో అభ్యర్థికి ఛాతిలో నొప్పి
- ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- సత్వర చికిత్స అనంతరం మళ్లీ పరీక్షకు హాజరు

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం/పాల్వంచ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షలు ఇరు జిల్లాల్లో ప్రశాంతంగా ముగిశాయి. ఖమ్మం జిల్లాలో 28వేల 101 మంది అభ్యర్థులు గ్రూప్ 2 పరీక్షలకు హాజరయ్యేందుకు వీలుగా మొత్తం 85 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షాకేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన చేసినట్లు, ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ స్థానిక ప్రభుత్వ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్ -2 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రతి అభ్యర్థికి ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్‌లను పబ్లిక్ సర్వీస్ కమిషన్ తయారు చేసిందని, పరీక్షలకు అభ్యర్థి రాకపోయినా సంబంధిత అభ్యర్థి బెంచ్‌పై ఓఎంఆర్ షీట్ పెట్టారో లేదో కలెక్టర్ తనిఖీ చేశారు.

ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో 38 పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు అధికారులు 144సెక్షన్ విధించి బందోబస్తును (మిగతా 6వ పేజీలో)


పాల్వంచలో దుస్తులు విప్పి నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థి


ఆస్పత్రిలో రవికుమార్

ఎందుకో ఈ గోప్యత!?

- గ్రూప్-2 పరీక్షల హాజరు వివరాలు వెల్లడించని ఖమ్మం జిల్లా అధికారులు
- మిగతా అన్ని జిల్లాల్లో వెల్లడి.. కానీ ఖమ్మంలోనే ప్రత్యేక రూల్ 6

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడల ప్రారంభంలో డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి
- తొలిరోజు 870 మంది క్రీడాకారులు హాజరు


గౌరవ వందనం స్వీకరిస్తున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ప్రపంచ గుర్తింపు లభిస్తుందని అన్నారు. చిన్నతనం నుంచి క్రీడలను అలవరుచుకోవవాలని, చదువుతో పాటు ఆటలు అవసరమని అన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో క్రీడలను ఆడి విజయం సాధించడానికి కృషి చేయాలన్నారు. పల్లెల నుంచి ప్రపంచ స్థాయికి చేరుకోవాలనే ఉద్ధేశ్యంతో సీఎం కప్ క్రీడా పోటీలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. అనంతరం జిల్లా పౌర సంబంధాల అధికారి గౌస్ పాషాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. నగరంలో ఈనెల 21వరకు జరగనున్న ఈ పోటీలకు జిల్లాలోని 21మండలాల నుంచి తొలిరోజు సుమారు 870మంది క్రీడాకారులు హాజరైనారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో భాగంగా సోమవారం క్రీడాకారులకు కబడ్డీ(మెన్), స్విమ్మింగ్(మెన్,ఉమెన్), రెజ్లింగ్(మెన్), టేబుల్ టెన్నిస్ (బాలురు, బాలికలు), కరాటే (బాలురు, బాలికలు), బాస్కెట్‌బాల్ (మెన్), వాలీబాల్(మెన్) విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు క్రిష్టఫర్, షఫీ, సాంబమూర్తి, కోచ్‌లు గౌస్, అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు నిర్వహించినందుకు వ్యాయామ ఉపాధ్యాయులకు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇచ్చే రెమ్యునరేషన్‌పై పలువురు పీఈటీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో సంబంధిత క్రీడల ఇన్‌చార్జిలు పీఈటీలకు చెల్లించే సొమ్మును కాజేశారని, ఈసారి అలా ఇవ్వకుండా నేరుగా తమకే ఇవ్వాలని క్రీడల అధికారి సునీల్‌రెడ్డిని కోరారు. అంతే కాకుండా కొంతమంది క్రీడల ఇంచార్జిలు తమకు కావాల్సిన వారినే క్రీడల నిర్వహణకు రమ్మంటున్నారని, మిగతా వ్యాయామ ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.


మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు


కబడ్డీలో తలపడుతున్న దృశ్యం


హరిశ్చంద్ర పద్యపఠన పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం

22న మధిరలో జిల్లాస్థాయి హరిశ్చంద్ర
పద్యపఠన పోటీలు

బ్రోచర్ ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుమిత్ర యూత్ అసోసియేషన్, చందాల కేశవదాసు కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22న మధిరలో జిల్లా స్థాయిలో విద్యార్థులకు హరిశ్చంద్ర పద్యపఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, సంస్థ కార్యదర్శి నిభానుపూడి సుబ్బరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. సత్య హరిశ్చంద్ర నాటక రచయిత, కవి బలిజేపల్లి లక్ష్మీకాంత 143వ వర్థంతిని పురస్కరించుకొని ఈ పోటీలు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్ విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో విభాగం నుంచి ఒక్కో పాఠశాలనుంచి కేవలం ముగ్గురు విద్యార్థులను మాత్రమే అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు ఎంపిక చేసిన పద్యాలకోసం, తమ పేరును నమోదు చేసుకొనేందుకు సెల్ నెం. 9440466522 నందు సంప్రదించాల్సిందిగా సూచించారు. ఈకార్యక్రమంలో రంగస్థల కళాకారుడు చిలువేరు శాంతయ్య ఇరపనూరి వసంత్, చిలువేరు బుచ్చిరామయ్య తదితర కళాకారులు పాల్గొన్నారు.

వినతులను సత్వరమే పరిష్కరించాలి

ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


కలెక్టర్‌కు విన్నవిస్తున్న మహిళ

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలనుంచి అర్జీలు తీసుకుని వాటిని ఎలా పరిష్కరించాలో, ఎన్నిరోజుల్లో పరిష్కరించేది తెలపాలన్నారు. వాటికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి పరిష్కారానికి కృషిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సన్యాసయ్య, డీఆర్వో ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అందిన ఫిర్యాదులు ఇవీ...

- ఖమ్మం మదీన మసీదు అధ్యక్షుడు ఎండీ హకీం ముస్తఫానగర్ ఏరియాలోని మైనారిటీలకు ఖబరస్తాన్ ఏర్పాటుకు భూమి కేటాయించాలని కలెక్టర్‌కు విన్నవించారు.
- కల్లూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన చింతలపాటి చెన్నారావు మన ఊరు-మన బడి పథకం కింద తల్లాడ మండలం కుర్నవల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో రూ.45లక్షల విలువ గల పనులు చేశానని, వీటికిగాను రూ.10లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆ బిల్లులను ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు.
- ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన కృష్ణవేణి వల్లభి గ్రామలో అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్ట్ ఖాళీ ఉందని ఎస్టీ కులానికి చెందిన తనకు అవకాశం కల్పించాలంటూ కలెక్టర్‌ను వేడుకుంది.
- తల్లాడ గ్రామానికి చెందిన ఈలప్రోలు అంజలి తాను కడు నిరుపేదనని తనకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించుకుంది.

లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు అందజేత

భద్రాద్రి ఎస్పీ కార్యాలయంలో అందించిన రోహిత్ రాజ్


రివార్డును అందచేసిన జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ ఇటీవల జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన ఏడుగురు సభ్యులకు సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ చెక్కు రూపంలో రివార్డును అందజేశారు. తుమ్రేల్ గ్రామం, పామేడు పోలీస్ పరిధి బీజాపూర్ జిల్లాకు చెందిన పొడియం మంగు అలియాస్ దేవేందర్‌కు రూ.4లక్షలు, కొరకట్పాడు గ్రామం, చర్ల మండలానికి చెందిన మడకం అడిమె అలియాస్ అనూషకు రూ.4లక్షలు, గొల్లగుప్ప గ్రామం, ఏటపాక అల్లూరి సీతారామరాజు జిల్లా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోరం సోమయ్య అలియాస్ సోమకు రూ.లక్ష, డోకుపడు గ్రామం కిష్టారం పీఎస్ సుకుమ జిల్లాకు చెందిన సొడ్డిపొజ్జి అలియాస్ చిలుకకు రూ.4లక్షలు, డోకుపాడు గ్రామం కిష్టారం పీఎస్ కుసుమ జిల్లాకు చెందిన మడివి సోమిడి అలియాస్ రమ్యకు రూ.4లక్షలు, అడవి రామారం గ్రామం ఆళ్లపల్లి భద్రాద్రి జిల్లాకు చెందిన మడకం ఇడుమయ్య అలియాస్ మహేష్‌కు రూ.లక్ష, కిష్టారంపాడు గ్రామం చర్ల మండలం భద్రాద్రి జిల్లాకు చెందిన వ్యక్తి లక్ష్మయ్య అలియాస్ కల్లుకు రూ.లక్ష అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ 2023-24సంవత్సర కాలంలో లొంగిపోయిన 26మంది సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం నుంచి మంజూరైన రివార్డు నగదును వారి పునరావాసం కోసం అందజేశారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో స్వార్థ ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ అగ్ర నాయకులు అమాయకులైన ఆదివాసీలను బలవంతంగా తమ పార్టీలోకి చేర్చుకుంటూ వారి చేత చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయిస్తున్నారని,లొంగిపోయిన నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ సభ్యులకు జిల్లా పోలీసుశాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, దుమ్ముగూడెం సీఐ అశోక్, చర్ల సీఐ రాజవర్మలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

సత్తుపల్లిరూరల్ /ఖమ్మం ఖానాపురం హవేలీ, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో ఈనెల 14,15వ తేదీల్లో నిర్వహించిన జిల్లా 6వ టీఎస్ యూటీఎఫ్ మహాసభల సందర్భంగా జిల్లా నూతనకార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా షేక్.రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బుర్రి వెంకన్న, షమీ, కోశాధికారిగా వల్లంకొండ రాంబాబు, కార్యదర్శులుగా ఎం.నర్సయ్య, డీ.నాగేశ్వరరావు, వీవీ.రామారావు, కే.నిర్మలాకుమారి, పీ.సురేష్, బీ.రాందాస్, ఎస్‌కే.నాగుర్‌వలీ, ఎస్‌కే.ఉద్దండ్ షరీఫ్, కే.పద్మ, సీహెచ్.రోజా, జీ.రామకృష్ణ, ఏ.కోటేశ్వరరావు, డీ.ఉమామహేశ్వరరెడ్డి, కే.విజయకుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్.సుధాకర్‌రావు, సభ్యులుగా ఆర్.అరవింద్‌కుమార్, కే.వెంకటేశ్వరరావు, జీడీఎస్ వీ.రమణ, వీ.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. అదేవిధంగా జిల్లా కమిటీ సభ్యులుగా 119మందిని, ఆఫీస్ బేరర్లుగా 19మందితో పాటు మరో ఐదుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మహాసభలను విజయవంతం చేసిన ఉపాధ్యాయులు అందరికీ మండల అధ్యక్ష, కార్యదర్శులు చెరుకు శ్రీనివాసరావు, కే.వెంకటేశ్వరరావులు కృతజ్ఞతలు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న ఈవో సులోచన

పాండురంగ భజనమందిరం ఈవోకు
బెస్ట్ సర్వీసు సొసైటీ నేషనల్ అవార్డు

కొత్తగూడెం సాంస్కృతికం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ సర్వీసు సొసైటీ నేషనల్ అవార్డు 2024ను కొత్తగూడెం పాండురంగ భజనమందిరానికి చెందిన ఈవో సులోచన ఆదివారం న్యూ ఢిల్లీలోని ఆంధ్ర ఆడిటోరియంలో బహుజన సాహిత్య అకాడమి చైర్మన్, జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ యూ.సుబ్రహ్మనియన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి బహుజన సాహిత్య అకాడమి గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ ప్రతీ యేటా ఈ అవార్డును అందజేస్తున్నట్టు వివరించారు. 27రాష్ట్రాల నుంచి సుమారు 1000మంది అతిథులు ఈ సమావేశానికి హాజరైనట్టు తెలిపారు. కొత్తగూడేనికి చెందిన ఈవో సులోచనకు ఈ అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తస్మాత్ జాగ్రత్త!

(5వ పేజీ తరువాయి)

వాతావరణం వల్ల గాలిలో తేమ తగ్గడం వల్ల పెదవులు, ముఖం, చర్మం పొడిబారుతుంటాయి. దురద వల్ల గోకితే పుండ్లు పడతాయి. కొబ్బరినూనె ఇతర మాయిశ్చరైజర్లతో చర్మం పొడిబారిపోకుండా చూసుకోవాలి.

- చలికాలంలో చాలామంది నీళ్లు తాగడం మానేస్తుంటారు. అది యూరిన్ ఇన్ఫెక్షన్లకు దారి తీస్తుంది. దాహం లేకపోయినా 7-8 గ్లాసులు నీళ్లు తీసుకోవాలి. ఫలితంగా చర్మం కూడా మృదువుగా ఉంటుంది.
- ముఖ్యంగా చాతి పట్టేసినట్లు ఉండటం, ఆయాసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, జ్వరం రెండు, మూడు రోజుల కంటే ఎక్కువగా ఉంటే న్యుమోనియా కింద భావించాలి. వెంటనే వైద్యులను సంప్రదించాలి. పిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో చలికాలంలో అప్రమత్తంగా ఉండాలి. చలికాలంలో పిల్లలు, వృద్ధులు న్యుమోనియా బారిన పడతారు. ఈ సమస్య అధిగమించేందుకు చల్లని వాతావరణంలో ఎక్కువసేపు ఉండొద్దు.
- రోగ నిరోధకశక్తి పెంచుకునేందుకు ప్రయత్నించాలి. సి-విటమిన్ ఎక్కువగా ఉండే పండ్లు తినాలి. పండ్ల రసాలు తాగాలి. మంచి నీరు తగినంత తీసుకోవాలి, వండిన తాజా ఆహారాన్ని భుజించాలి. నిల్వ పదార్థాలకు దూరంగా ఉండాలి.
- కాలానికి అనుగుణంగా వచ్చే మార్పులను స్వాగతించాలి. శరీరంలో రక్త ప్రసరణ సక్ర మంగా జరిగేలా నడక, పరుగు సాగించాలి. ఉదయం పూట వేడి నీరు తాగాలి. వేళకు భుజించాలి. సీజనల్‌గా వచ్చే పండ్లను తింటే రోగాలబారిన పడకుండా జాగ్రత్తపడొచ్చు.

ఎందుకో ఈ గోప్యత!?

గ్రూప్-2 పరీక్షల వివరాలు వెల్లడించని ఖమ్మం జిల్లా అధికారులు

మిగతా అన్ని జిల్లాల్లో వెల్లడి.. కానీ ఖమ్మంలోనే ప్రత్యేక రూల్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-2 పరీక్షల హాజరు వివరాలు తెలపడంలో ఖమ్మం జిల్లా అధికారులు గోప్యత పాటిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఖమ్మం జిల్లాలో ప్రత్యేక నిబంధనలేమైనా అమలవుతున్నాయా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆది, సోమవారం నిర్వహించిన గ్రూపు 2పరీక్షలకు హాజరైన, గైర్హాజరైన అభ్యర్థుల వివరాలు సమగ్రంగా మీడియాకు అందించారు. కానీ ఖమ్మంలో వాటిని తెలిపేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. డీఆర్వో స్థాయి నుంచి అదనపు కలెక్టర్ స్థాయి వరకు సమాచారాన్ని ఇవ్వకపోవడం గమనార్హం. పరీక్షల విజయవంతం కోసం అభ్యర్థులకు పలు సలహాలు, సూచనలు ఇస్తూ విస్తృత ప్రచారాన్ని కోరుకున్న అధికారులు పరీక్ష రోజు అభ్యర్థుల హాజరు, గైర్హాజరు లాంటి వివరాలు తెలపడంలో ఎందుకు ఇంత గోప్యత పాటిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. ఈ విషయమై జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి (డీపీఆర్వో)ని వివరణ కోరగా అధికారులు గ్రూపు-2 పరీక్షల హాజరు వివరాలు ఇవ్వడానికి నిరాకరించారని తెలిపారు. ఈ నిరాకరణ వెనుక మతలబు ఏమిటనేది తేలాల్సి ఉంది.

తప్పిపోయిన వృద్ధురాలి అప్పగింత

ఖమ్మం ఖానాపురం హవేలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం దంతలబోరు గ్రామానికి చెందిన సిద్దుల ఈశ్వరమ్మ అనారోగ్యంతో ఉండగా కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స కోసం ఈ నెల 10న ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె 12వ తేదీన హాస్పిటల్ నుంచి తప్పిపోయింది. కుటుంబ సభ్యులు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఖమ్మం నగరంలో ఎంత వెతికినా దొరక్క వాళ్ల సొంత ఊరు వెళ్లిపోయారు. ఆదివారం రాత్రి అర్బన్ పోలీస్ పరిధిలోని టేకులపల్లి డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో వృద్ధురాలు రాత్రిపూట తిరుగుతుండగా ప్రజలు డయల్ 100కు కాల్ చేశారు. స్పందించిన పోలీసులు రాత్రి 12 గంటల ప్రాంతంలో అన్నం ఫౌండేషన్‌కి సమాచారం ఇచ్చారు. అన్నం ఫౌండేషన్ ప్రతినిధులు ఘటన స్థలానికి చేరుకోగా ప్రజల సమక్షంలో పోలీసులు వృద్ధురాలిని అప్పగించారు. అన్నం ఫౌండేషన్ సభ్యులు ఆ వృద్ధురాలితో మాట్లాడగా కొద్ది వివరాలు చెప్పినది. కుటుంబానికి సమాచారం ఇవ్వగా కుటుంబ సభ్యులు వచ్చి ఖమ్మం టూ టౌన్ పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు సిద్దుల ఈశ్వరమ్మను అప్పగించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావు పాల్గొన్నారు

చలి పంజా

(5వ పేజీ తరువాయి)

రారెత్తించే కొత్తగూడెం.. ఇప్పుడు చలి పంజా విసురుతూ వణికిస్తోంది. బొగ్గు గనులకు, పరిశ్రమలకు ఆలవాలమైన కొత్తగూడెంలో గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతూ, చలిగాలులు పెరిగిపోతున్నాయి. తెల్లవారుజామున మంచు కురుస్తుండటంతో జనం ఇళ్ల నుంచి బయటకురాలేని పరిస్థితి ఏర్పడింది. ఉదయం సమయంలో 10 గంటల తర్వాతే సూర్యుడు కనిపిస్తున్నాడు. పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఉదయం, రాత్రివేళల్లో చలిమంటలు వేసుకుని కాగుతున్నారు.

దట్టమైన పొగతో మంచుకురవడం వల్ల తెల్లవారుజామున రోడ్లపై వెళ్లే వాహనాలకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం వేళ ప్రధాన రహదారిపై సైతం వాహనాలకు లైట్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల ఏజెన్సీ పల్లెల్లో చలి ముదిరిపోయి జనం బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు చలి ప్రభావం మూలంగా నానా ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులనుంచి పగటి పూట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా మరింత తగ్గిపోతున్నాయి. ఉపరితల గాలులు అధికంగా రావడం, మంచు కురవడం వల్ల జలుబులు, తుమ్ములు పట్టి జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. చలి తీవ్రత వల్ల వృద్ధులు, పిల్లలకు ఊపిరితిత్తుల్లో నిమ్ము ఏర్పడి గాలి ఆడక ఇబ్బందులు పడుతున్నారు.

చలిమంటలే శరణ్యం

ఏజెన్సీలోని అటవీ గ్రామాలను చలి వణికిస్తోంది. గిరిజన గ్రామాల ప్రజలు చలికి తట్టుకోలేక అల్లాడుతున్నారు. చలిమంటల పక్కన పడుకుంటున్న పరిస్థితి నెలకొంటున్నది. ఏజెన్సీలో 100కుపైగా గొత్తికోయ గ్రామాలు దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఉన్నాయి. సుమారు 300కుటుంబాలు నివసిస్తున్నారు. అదేవిధంగా 1200కు పైగా ఉన్న గిరిజన గ్రామాల అటవీ ప్రాంతంలో నివసిస్తున్నారు. ఏజెన్సీ మొత్తంగా అటవీ గ్రామాలు చలితో వణికిపోతున్నాయి. సాయంత్రం సమయం నుంచి చలిమంటలు వేసుకుని చుట్టూ చేరుతున్నా రు. పిల్లలను సైతం చలిమంటల పక్కనే పడుకోపెట్టుకుంటున్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రబోడుపాడు, సీతారాంపురం, కోయగట్టు, రెడ్డిగూడెం, సారెకల్లు, ఒంటిగుడిసె, పెద్దకలిస, చిరుతాలపాడు, రాళ్లచెలక, మల్లారం గ్రామాల్లో గిరిజనులు చలిమంటలు లేకుండా ఉండలేకపోతున్నారు.

రైతు భరోసాను తక్షణమే అమలు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమంతరావు

ఖమ్మంటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీపై ప్రభుత్వం అబద్ధపు ప్రచారాలు చేస్తోందని, రూ.2లక్షల లోపు రుణాలున్న రైతుల్లో ఎక్కువ మంది రైతులకు మాఫీ కాలేదని సీపీఐ అనుబంధ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు విమర్శించారు. రైతు భరోసాను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్త ఆందోళనల్లో భాగంగా సోమవారం రైతుసంఘం ఆధ్వర్యంలో ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న బాగం హేమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులయితే వారిలో సగంమందికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు లేవని, కుటుంబ సభ్యుల సంఖ్య సరిపోలేదని, రైతు మరణించాడని, బ్యాంక్ ఖాతాల్లో తప్పులు ఉన్నాయని... ఇలా వివిధ సాకులు చెబుతూ రుణమాఫీని అర్హులందరికీ చేయటం లేదన్నారు. ఏడాదికాలంగా రైతుభరోసాను ఇవ్వకుండా వాయిదాలు పెడతూ కాలాయాపన చేస్తున్నారన్నారు. రైతుబీమాతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా రైతు ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నారని, రైతులపై నిర్బంధాలను నిలిపివేసి, వారిపై పెట్టిన అక్రమకేసులను ఎత్తివేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28నుంచి అమలు చేయనున్న ఆర్థిక చేయూత పథకాన్ని ప్రతి పేదవాడికి వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, మామిడి సుదర్శన్‌రెడ్డి, పుచ్చకాయల సుదర్శన్, పొసంగుల చందర్‌రావు, వెన్నం భాస్కర్, సీపీఐ నాయకులు ఎస్‌కే.జానీమియా, మహ్మద్ సలాం, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివారెడ్డి, నూనె శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలోకి పెద్దపులి

కరకగూడెం/మణుగూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్న పెద్దపులి సోమవారం ములుగు జిల్లాలోకి ప్రవేశించింది. ఆదివారం కరకగూడెం మండలంలోని రఘునాథపాలెం అడవుల్లో పెద్దపులి అరుపులు వినిపించడంతో దాని పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో సోమవారం పులి భద్రాద్రి జిల్లా సరిహద్దు నుంచి ములుగు జిల్లా తాడ్వాయి మండలం కౌశెట్టివాయి, సోలేడు, బీరెల్లి, నర్సాపూర్, కాటాపురం, బందాల వైపు వెళ్లింది. నర్సాపూర్ అటవీ ప్రాంతంలో కరకగూడెం, తాడ్వాయి మండలాల అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి పెద్దపులి పాదముద్రలను గుర్తించినట్లు మణుగూరు డీఎఫ్‌వో సయ్యద్ మక్సూద్ మొహిద్దిన్ తెలిపారు. పెద్దపులి ములుగు జిల్లా అడవుల్లోకి వెళ్లిందని అధికారులు ప్రకటించడంతో కరకగూడెం మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పులి కదలికలను గుర్తించేందుకు కరకగూడెం మండలం చిరుమళ్ల అటవీ ప్రాంతంలో డీఎఫ్‌వో మక్సూద్ మొహిద్దిన్, రేంజర్ ఉపేందర్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఛత్తీస్‌గఢ్ రత్నగిరి టైగర్‌జోన్ నుంచి రాక..

ప్రస్తుతం మణుగూరు డివిజన్ దాటి ములుగు జిల్లా పరిధిలోకి వెళ్లిన పెద్దపులి 2021లో వచ్చిన రూట్‌లోనే ప్రయాణిస్తోందని మణుగూరు డీఎఫ్‌వో సయ్యద్ మక్సూద్ తెలిపారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పెద్దపులి ఛత్తీస్‌గడ్‌లోని రత్నగిరి టైగర్‌జోన్ నుంచి బయలుదేరి ఇలా ప్రయాణిస్తోందన్నారు. ప్రస్తుతం భద్రాద్రి జిల్లా సరిహద్దులు దాటుతోందన్నారు. పులి పాదముద్రలను బట్టి అది ఆడపులా మగ పులా గుర్తించవచ్చన్నారు. పాదముద్రలు చతురస్రాకారంలో ఉంటే మగపులి అని త్రిభుజాకారంతో ఉంటే ఆడపులి అని గుర్తిస్తామన్నారు. ప్రస్తుతం ఇక్కడ సంచరించేది మగ పులిగా నిర్ధారించామన్నారు. ఈ పులి గత రెండేళ్లుగా ఈ పరిసర ప్రాంతాల్లోనే తిరుగుతోందన్నారు. రెండు వేల కిలోమీటర్ల సరిహద్దులో చైన్ బోర్డర్‌లో తిరుగుతుంటుందన్నారు.

ప్రస్తుతం సరిహద్దు ఆడవుల్లో సంచరిస్తోందన్నారు. ఏ ప్రాంతంలో ఆడపులుల సంచారం ఉన్నదో గుర్తించే పనిలో అటవీశాఖ సిబ్బంది ఉన్నారని తెలిపారు. 2021 నవంబరు, డిసెంబరు నెలల్లో సంచరించిన మార్గంలోనే ప్రస్తుతం పులి వెళుతోందన్నారు. పెద్దపులిపై స్మగ్లర్ల కన్ను పడకూడదనే ఉద్దేశంతోనే పులి సంచారాన్ని గోప్యంగా ఉంచామన్నారు.

పులి సంచరిస్తున్న రూట్‌ను ముందుగానే గుర్తిస్తూ ఆ మార్గంలో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల ప్రజలకు హెచ్చరికలు చేస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా ఆయా ప్రాంతాల పరిధిలోని ఫారెస్టు సిబ్బంది, అధికారులు పగలు, రాత్రి గస్తీ కాస్తున్నామన్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో తిరిగే పులికి ఆహార సమస్య ఉండదని తెలిపారు. పులిని, పశువులను, మనుషులను కాపాడేందుకు అటవీశాఖ తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

సత్తుపల్లిలో సీపీఎం జిల్లా మహాసభలు

(5వ పేజీ తరువాయి)

కార్యవర్గాన్ని ఎన్నుకునే ఆనవాయితీ సీపీఎంకు ఉందని నాగేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలో 516శాఖ మహాసభలు, 28 మండల, పట్టణ మహాసభలు, 5డివిజన్ మహాసభలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. ప్రతి మూడేళ్ల కొకసారి నిర్వహించే మహాసభల్లో ఉద్యమాల రూపకల్పనపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీపీఎం ప్రజాపోరాటాల విషయంలో నిత్యం ముందుంటుందన్నారు. గత మూడేళ్ల కాలంలో ఎన్నో పోరాటాలు చేశామన్నారు. ప్రజాపోరాటాలే కాకుండా సామాజిక కార్యక్రమాల్లో కూడా సీపీఎం ముందుంటుందని నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. గత ఎనిమిదేళ్లుగా జిల్లాలో ఆరు కేంద్రాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి, నామమాత్రపు ధరకు మందులు అందించటం, గుండె, క్యాన్సర్‌కు సంబంధించిన ఖరీదైన వైద్య పరీక్షలు ప్రముఖ వైద్యుల ద్వారా ఉచితంగా చేయిస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు కళ్యాణం వేంకటేశ్వరరావు, బండి రమేష్, నెల్లూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు


అధికారులతో మాట్లాడుతున్న కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. జిల్లాలో మొత్తం 13,466అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా మొదటిరోజు ఆదివారం రెండు సెషన్స్‌లో కలిపి 12,572మంది హాజరయ్యారు. ఇక రెండోరోజు సోమవారం రెండు సెషన్స్‌లో కలిపి 12,343మంది అభ్యర్థులు హాజరయ్యారు. కలెక్టర్ జితేష్ వీ పాటిల్ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరులోని సెయింట్‌మేరీస్ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

ఇదిలావుండగా, పాల్వంచలోని నెహ్రూనగర్‌లో ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద గ్రూప్-2 పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థి హల్‌చల్ చేశాడు. సకాలంలో పరీక్ష కేంద్రానికి రాకపోవడంతో నిర్వాహకులు, పోలీసులు ఆ అభ్యర్థిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో తనను ఎందుకు అనుమతించడం లేదంటూ వాగ్వాదానికి దిగి, దుస్తులు విప్పి పరీక్ష కేంద్రం వద్ద కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశాడు.

పరీక్ష రాస్తుండగా ఛాతిలో నొప్పి

పాల్వంచ కిన్నెరసాని రోడ్డులోని గౌతమి స్కూల్ గ్రూప్-2 పరీక్షా కేంద్రంలో అభ్యర్థి సోమవారం అస్వస్థతకు గురయ్యాడు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన కొమరవరపు రవి గ్రూప్-2 పరీక్షలకు హాజరయ్యాడు. మార్నింగ్ సెషన్ ప్రశాంతంగా పూర్తి చేసుకున్నాడు. ఈవినింగ్ సెషన్‌లో పరీక్ష రాస్తుండగా అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి తలెత్తింది. దీంతో నిర్వాహకులు రూట్ ఆఫీసర్‌తో, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి పరీక్షా కేంద్రం ఇన్‌చార్జి, అశ్వారావుపేట సీఐ కరుణాకర్‌కు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన సీఐ హుటాహుటిన అంబులెన్స్‌తో సహా పరీక్షా కేంద్రం వద్దకు చేరుకుని అతనిని పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు రవిని పరీక్షించి, సత్వర చికిత్స అందించారు. కొద్దిసేపటికి అతని పరిస్థితి నిలకడగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు తిరిగి అతనిని పరీక్షా కేంద్రానికి తరలించి పరీక్ష రాయడానికి సహకరించారు. ప్రాణాపాయ స్థితి నుంచి అభ్యర్థిని రక్షించడమే కాక అతనిని మళ్లీ పరీక్ష రాసుకునేలా చొరవ చూపిన అశ్వారావుపేట సీఐని పలువురు అభినందించారు.

'అనంతారం' అనారోగ్యానికి
కారణాలేంటి?

- మూత్ర పిండాల వ్యాధి బాధితులపై నివేదికకు ఆదేశం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- గ్రామాన్ని సందర్శించిన వైద్య, మండల పరిషత్ అధికారులు




కిడ్నీ వ్యాధి బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారి వెంకటేశ్వర్లు

జూలూరుపాడు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామంలో కిడ్నీ వ్యాధి బాధితుల గురించి సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కిడ్నీ వ్యాధి కబళిస్తోంది' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ జితేష్. వి. పాటిల్ స్పందించారు. వెంటనే అనంతారం గ్రామానికి వెళ్లి పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్‌ను ఆదేశించారు. దీంతో వైద్య, మండల పరిషత్ సిబ్బంది అనంతారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో అనారోగ్యంతో మంచం పట్టిన వారి ఇళ్లకు వెళ్లారు. వారి ఆరోగ్య పరిస్థితి, చికిత్స పొందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలో కిడ్నీ వ్యాధి బాధితుల వివరాలు సేకరించామని తెలిపారు. గ్రామానికి చెందిన కోరం నాగేశ్వర రావు, మందెరకల సత్యంకు భద్రాచలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలను అందించేందుకు మంగళవారం పంపిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి రక్త నమూనాలను సేకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో తుల సీరాం, సీహెచ్‌వో రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎం సావిత్రి, ఆశా కార్యకర్త ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

కిడ్నీ వ్యాధితో ప్రాణాలు పోతున్నా వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించటం ఏమిటంటూ గ్రామస్థులు వైద్య సిబ్బందిని నిలదీశారు. డయాలసిస్ కోసం కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి రోగులు వెళితే పడకలు ఖాళీగా లేవని నిర్లక్ష్యపు సమాధానం చెప్పి పంపించటం ఏమిటంటూ ప్రశ్నించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చెప్పినా డీఎంహెచ్‌వో పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో డయాలసిస్ సేవలు అందకపోవటంతోనే ప్రేమలత, నరేష్ మృతి చెందారని అన్నారు.

మురిపించేలా మ్యూజియం

- గిరిజన ప్రదర్శనశాలకు అదనపు హంగులు
- మూడు దూలాల ఇల్లు, వెదురు గుడిసె, సెల్ఫీ పాయింట్లు..
- నోరూరించే రుచికరమైన గిరిజన వంటకాలు
- పర్యాటకులను రప్పించడమే లక్ష్యం
- కలెక్టరు, ఐటీడీఏ పీవో ప్రత్యేక చొరవతో వేగిరమైన పనులు

ముక్కోటి రోజున ప్రారంభించేందుకు కసరత్తు



నిర్మాణ దశలో ఉన్న మూడు దూలాల ఇల్లు, వెదురు గుడిసె

భద్రాచలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) గ్రామీణ వాతావరణంలో గిరిజన పల్లె జీవనాన్ని ప్రతిబింబించేలా ఏర్పాట్లు, ఏజెన్సీలో గిరిజన సంప్రదాయ వంటకాలు, బోటింగ్, బాణాలు, విల్లంబులు, చిన్నారులకు ఫన్ గేమ్స్.. ఇలాంటి ఆహ్లాదకర వాతావరణానికి వేదికగా నిలవబోతోంది భద్రాచలం ఐటీడీఏలోని గిరిజన మ్యూజియం ప్రాంగణం. పట్టణ ప్రాంతాల్లో వృత్తి, ఉద్యోగ రీత్యా ఒత్తిడికి గురవుతున్న వారు సేద తీరేందుకు ఏజెన్సీలోని గ్రామీణ వాతావరణాన్ని పూర్తిగా వారి ముందు ఉంచేలా పరిసరాలను తీర్చిదిద్దుతున్నారు. అంతేకాదు గిరిజన సంప్రదాయ నృత్యాలు, పాటలు, అటవీ ఉత్పత్తులు, అల్లికలు.. వివిధ రకాల సమాహారంతో పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లా పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించేందుకు విశేష కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఐటీడీఏ పీవో బి.రాహుల్‌తో కలిసి పూర్తిగా ఏజెన్సీ ప్రకృతి సహజసిద్ధంగా ఉండేలా తీర్చిదిద్ది పర్యాటకులను ఆకర్షించనున్నారు. ఇదే క్రమంలో దుమ్ముగూడెం మండలంలోని బొజ్జిగుప్ప గ్రామంలో సైతం వారాంతాల్లో గడిపేలా గిరిజన సంప్రదాయ సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లను చేపడుతున్నారు. ఈ క్రమంలో ఔత్సాహికులైన గిరిజనులను ప్రోత్సహిస్తున్నారు. ఐటీడీఏలోని వివిధ విభాగాల బాధ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు పర్యాటకులను ఆకర్షించే చర్యలపై కలెక్టర్, పీవో సమీక్షిస్తుండటం విశేషం. ఇందుకోసం రూ.15 లక్షల వరకు వెచ్చిస్తున్నారు.

ఆకర్షణీయంగా గిరిజన మ్యూజియం

ఇప్పటికే గిరిజన పూర్వీకుల సంప్రదాయ వృత్తులు, జీవన స్థితిగతులు, ఆహారం, వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన పనిముట్లు, దుస్తులు, పరికరాలు గిరిజన మ్యూజియంలో ఉన్నాయి. వివిధ జాతుల వాయిద్యాలు, చెక్కబొమ్మలు, బుర్రలు, సొక్కుబుర్రలు బాణాలు, విల్లంబులు, బల్లాలు, ఆదివాసీ మహిళ ఆభరణాలు, ఆదివాసీల వేషధారణ వస్త్రాలు, వెదురు అల్లికలు, చేపలవేటకు వినియోగించే పనిముట్లు, ఆదివాసీలు వేటకు వెళ్లిన సమయంలో వినియోగించే పరికరాలు, ఎడ్లబండ్లు ఉన్నాయి. ఈ గిరిజన మ్యూజియాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ఉన్నారు.

నోరూరించే వంటకాలు

ఫాస్ట్‌ఫుడ్, పబ్ కల్చర్‌కు అలవాటుపడ్డ వారికి నోరూరించే రుచికరమైన సంప్రదాయ గిరిజన వంటకాలను సిద్ధం చేయనున్నారు. రాగి, జొన్నజావ, రాగి, జొన్న లడ్డూలు, నువ్వుల లడ్డూ, రాగి, జొన్న బిస్కెట్లు, రాగి, జొన్న సంకటి, గటక అన్నం, కరకొమ్ములతో కూర(క్యాబేజీ తరహాలో)పచ్చకూర, బొద్దుకూర, చెంచలకూరలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. నాటుకోడి పులుసు, ఎండుచేపల పులుసు, రొయ్యల పులుసు, ఎండుచేపల కారం, బొంగు చికెన్‌లతో పాటు మాంసాహార వంటకాలను పర్యాటకులకు రుచి చూపనున్నారు. జొన్న పేలాలు, బొబ్బర గుగ్గిళ్లు, జొన్న గుగ్గిళ్లు, సీజనల్ పండ్లు తునికి పండ్లు పాల పండ్లు, పరిక పండ్లు, నక్కెర పండ్లు, చీమ చింతకాయను అందుబాటులోకి తేనున్నారు.

రూ.15లక్షలతో పనులు..

రూ.15లక్షలతో చేపడుతున్న పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే మూడు దూలాల ఇల్లు ఏర్పాటు చేయగా, మంచెను సైతం సిద్ధం చేస్తున్నారు. వెదురు గుడిసె, మట్టి ఇల్లు, సెల్ఫీ పాయింట్‌లు, వెదురు బొంగులతో నడిచేదారి రూపొందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించి ఈ పనులను వేగవంతం చేస్తున్నారు. ఈ పనులన్ని త్వరగా పూర్తి చేసి 2025 జనవరి 10న ముక్కోటి రోజున ప్రారంభించాలని లక్ష్యంతో జిల్లా కలెక్టర్ కసరత్తు చేపడుతున్నారు. ఇప్పటికే అధికారులకు దిశ నిర్దేశం చేసి ఆదేశాలు జారీ చేశారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు



లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న భవానీశంకర్

దమ్మపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా దమ్మపేట, నాచారం గ్రామాలలోని దేవాలయాలో భక్తులు సోమవారం ధనుర్మాస ప్రత్యేకపూజలు నిర్వహించారు. దమ్మపేట సంతాన వేణుగోపాలస్వామి ఆయలంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగాభక్తులు పూజలు చేసారు. నాచారం గ్రామంలో శంకుగిరిపై కొలువైవున్న లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయంలో వేదపండితులు వెంకటశాస్త్రి ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించారు. ఈపూజా కార్యక్రమాలలో గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి జమలాపురం భవానీశంకర్ పాల్గొని పూజలు చేశారు.

'నకిలీ పత్రాల'పై చర్యలు శూన్యం

- కల్యాణలక్ష్మి నిధులకు ఎసరుపై ముందుకు సాగని విచారణ
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికీ విలువ లేని వైనం..
- వ్యవహారాన్ని గుర్తించినా బాధ్యులపై చర్యలకు తాత్సారం

వైరా, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో కల్యాణలక్ష్మి సొమ్మును కాజేసేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టినప్పటికీ బాధ్యులపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం కేసు కూడా నమోదు కాలేదు. ఈ నకిలీ బాగోతాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయమే వెలుగులోకి తెచ్చినప్పటికీ విచారణలో ఎలాంటి పురోగతి కన్పించటం లేదనే విమర్శలున్నాయి. ఈ నకిలీగాళ్ల విషయంలో అసలేం జరుగుతుంది... ఎందుకంతా గోప్యత పాటిస్తున్నారు... అధికార పార్టీ నేతల వత్తిళ్లు ఏమేరకు పనిచేస్తున్నాయనే దానిపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దార్ ఈ నకిలీ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసి వారం దాటుతున్నా ఎలాంటి పురోగతి లేదనే విమర్శలున్నాయి.

ఈనెల 9వతేదీన నకిలీ పత్రాలతో కల్యాణలక్ష్మి సొమ్మును కాజేసేందుకు చేసిన ప్రయత్నం బయటపడింది. వైరా ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది అప్రమత్తతో నకిలీ బాగోతం వెలుగుచూసింది. కొణిజర్ల, వైరా తదితర ప్రాంతాలకు చెందిన కొంతమంది ఒక ముఠాగా ఏర్పడి నకిలీ పత్రాలు సృష్టించి కల్యాణలక్ష్మి సహా అనేక సంక్షేమ పథకాల సొమ్మును గత కొంతకాలంగా కాజేస్తున్నారనే చర్చ నడుస్తోంది. వైరాకు ఏమాత్రం సంబంధం లేదని సత్తుపల్లి, పెనుబల్లి మండలాలకు చెందిన దంపతులకు వైరాలో కల్యాణలక్ష్మి సొమ్ము కోసం నకిలీ పత్రాలతో దరఖాస్తు చేశారు. అయితే రెవెన్యూశాఖ అధికారులు, సిబ్బంది ఈ నకిలీ పత్రాలను సరిగా పరిశీలించకుండానే కల్యాణలక్ష్మికి సిఫారసు చేశారు. ఎమ్మెల్యే కార్యాలయానికి కల్యాణలక్ష్మి జాబితా వచ్చిన సమయంలో అక్కడి సిబ్బందికి అనుమానం వచ్చి వాటిని పరిశీలించారు. దాంతో నకిలీ బాగోతం బయటపడింది. ఏకంగా తహసీల్దార్ కార్యాలయానికి చెందిన ఆదాయ సర్టిఫికెట్ కూడా నకిలీదే. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు కల్యాణలక్ష్మి విచారణ సమయంలో ఆధ్రువపత్రాన్ని సరిగా పరిశీలించలేదనే విషయం స్పష్టమైంది.

నకిలీగాళ్లతో రెవెన్యూ కార్యాలయంలోని ఒకరిద్దరు అధికారులకు సిబ్బందికి ఉన్న సత్సంబంధాలతోనే ఈ బాగోతం జరిగిందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. చివరికి నకిలీ వ్యవహారం స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ దృష్టికి కార్యాలయ సిబ్బంది తీసుకువెళ్లారు. అదే సమయంలో తహసీల్దార్ కార్యాలయం ఈ నకిలీ వ్యవహారంపై వారంరోజుల కిందటే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆవెంటనే అధికార కాంగ్రెస్ పార్టీలోని వైరా, కొణిజర్ల మండలాలకు చెందిన కొంతమంది నాయకులు నకిలీగాళ్లకు అండగా పావులు కదిపారనే ఆరోపణలున్నాయి. వైరా సీఐ ఎన్.సాగర్ ఆధ్వర్యంలో ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ విచారణ చేస్తున్నారు. అయితే ఇంతవరకు ఎలాంటి కేసు నమోదు చేయలేదు. ఖమ్మం పోలీస్ కమిషనర్ ఆదేశాలతో ఈ కేసులో తదుపరి చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో వైరా పోలీసులు ఉన్నట్లు చర్చ నడుస్తోంది. పదోతరగతి మెమో, ఆధార్‌కార్డులోని అడ్రస్, ఆదాయ సర్టిఫికెట్ సహా అన్నీ నకిలీవేనని.. ఆధారాలు లభించినప్పటికీ విచారణ, చర్యలపై తీవ్ర జాప్యం జరుగుతుండటంతో స్థానికులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అశ్వాపురం డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో చోటు చేసుకుంది. కొత్తగూడేనికి చెందిన కేదం లింగమూర్తి(49) ద్వి చక్ర వాహనంపై కొత్తగూడెం నుంచి మణుగూరు శేషగిరి నగర్‌లోని అత్తగారింటికి వెళ్తుండగా మార్గ మధ్యలో మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలాన్ని సీఐ అశోక్‌రెడ్డి సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడి వద్ద ఉన్న ఎలక్షన్ గుర్తింపు కార్డు ద్వారా వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏటిలో పడి వలస కూలీ..

బోనకల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద ఏటిలో పడి వలస కూలీ మృతి చెందిన సంఘటనపై సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం గోకల్ ధూహేరి గ్రామానికి చెందిన భీర్‌సింగ్(55) తమ ప్రాంతానికి చెందిన వారితో కలిసి బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీ పనులకు వలస వచ్చారు. ఈక్రమంలో ఈ నెల 14న గ్రామసమీపంలో ఉన్న వైరా ఏటి వద్దకు స్నానానికి వెళ్లాడు. ఆతర్వాత తోటి వారు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏటి వద్ద గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభానికి చెలరేగిన మంటలు



చెలరేగుతున్న మంటలు

ఖమ్మంక్రైం, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): కరెంట్ స్తంభానికి మంటలు చెలరగేడంతో స్థానికులు ఆందోళనకు గురైన సంఘటన సోమవారం ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మమత ఆసుపత్రి రోడ్డు వెళ్లే మార్గం లో పెద్ద కరెంట్ స్తంభం కింద ఉన్న చెత్త కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించారు. కొద్దిసేపటి తర్వాత ఆ మంటలు చెలరేగి కరెంట్ స్తంభంపై ఉన్న వైర్లకు నిప్పంటుకుంది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమీపంలోని వారు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో, వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

1262 రకం ధాన్యంపై కిరికిరి

- 1262 రకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తున్న మిల్లర్లు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- మిల్లర్ల మేలు రకాన్ని తక్కువ రకంగా పరిగణిస్తున్నారని ఆవేదన
- సమస్యను పరిష్కరించాలని వినతి



సమస్యను తెలియజేస్తున్న మణుగూరు రైతులు

మణుగూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంట బోనస్ రాకుండా చేస్తారా.. ఇదెక్కడి అన్యాయం.... మిల్లర్లు ధాన్యం గ్రేడ్‌ను నిర్ణయించి చెప్పడం ఏమిటి.. ప్రభుత్వం తరుపున మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 1262 రకానికి గిట్టుబాటు ధర కూడా ప్రకటించారు.. అయితే కుంటి సాకులతో మిల్లర్లు మా ధాన్యం కొనగోలు చేయ డం లేదు.. ఎందుకు రైతులను ఇంతగా ఇబ్బంది పెడుతున్నారు. అంటూ పాత మణుగూరు పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మణుగూరులో 600 ఎకరాల్లో 1262 సాగు

మణుగూరు నేరేళ్ల చెరువు కింద దాదాపు 600 ఎకరాల్లో రైతులు 1262 వరి రకాన్ని సాగుచేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రకటనలో దాదాపు 33 రకాలకు సంబంధించి ఏగ్రేడ్ వర్తింప చేసింది. అయితే ఈ రకం వరిని మండలంలో అధికంగా సాగు చేశారు. కోతలు అయిపోయి దాదాపు 10 రోజులు అవుతుంది. మణుగూరు వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఆధ్వర్యంలో పాత మణుగూరు గ్రామంలోని కొత్తకొండాపురం వద్ద ఓ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. పండించిన పంటను రైతులంతా కేంద్రానికి సమీపంలో పలు ప్రాంతాల్లో తూర్పారబోసి ధాన్యం రాసులుగా పోశారు.

నాలుగు రోజులుగా పడిగాపులు

ఆరుగాలం కాయకష్టం చేసి పండించిన పంటను అమ్మకాలు జరుపుకుందామనుకున్న రైతులకు కొత్త సమస్య ఉత్పన్నమైంది. ప్రభుత్వం ప్రకటించిన గ్రేడ్-ఏ అయితే ఇక్కడి మిల్లర్లు మాత్రం ధాన్యం సరిగా లేదని నూకఅవుతుందని కుంటి సాకులు చెబుతూ ఈ రకాన్ని బీ-గ్రేడ్‌గానే తీసుకోవాలని సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో సొసైటీ నిర్వాహకులు ధాన్యం కొనుగోలు నిలిపివేశారు. గత నాలుగు రోజులుగా రైతులు ఆరబోసిన ధాన్యం రాసుల వద్దే పడిగాపులు పడుతున్నారు.

మిగతా మండలాల్లో ఈ రకం ధాన్యాన్ని అంతా ఏ గ్రేడ్ కింద కొనుగోలు చేయగా, ఒక్క మణుగూరు మండలంలోనే ఈ సమస్య నెలకొందంటున్నారు. అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి సత్వర చర్యలను చేపట్టాలని, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వైరాలోను తప్పని తిప్పలు..

వైరా, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు విరివిగా పండించిన ఎంటీయూ 1262రకానికి చెందిన సన్నరకం ధాన్యాన్ని తీసుకునేందుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారు. దాంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దాంతో ఈ ధాన్యం రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని పూసలపాడు సొసైటీ పాలకవర్గం, అధికారులు ఏకంగా జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్‌కు ఓ వినతిపత్రాన్ని సమర్పించారు.


పూసలపాడు సొసైటీ పరిధిలోని పూసలపాడు, నారపేనిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన విషయాన్ని ఆవినతిపత్రంలో గుర్తుచేశారు. అయితే ఈ ఖరీఫ్ సీజన్‌లో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 1262సన్నరకం ధాన్యం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పౌరసరఫరాల శాఖ డీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఆవినతిపత్రంలో పేర్కొన్న విధంగా పూసలపాడు ధాన్యం కొనుగోలు కేంద్రానికి 25వేల క్వింటాళ్ల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఇప్పటివరకు మిల్లులకు 490.40క్వింటాళ్లను మాత్రం పంపించారు. ఇంకా 24,509.6 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంది. నారపనేనిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి 35వేల క్వింటాళ్ల ధాన్యం వస్తుందని అంచనా కాగా ఇప్పటివరకు 3,283.60 క్వింటాళ్లను కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు. ఇంకా 31,716.40క్వింటాళ్ల ధాన్యం రైతుల వద్ద ఉంది. మొత్తంగా ఈ పూసలపాడు సొసైటీ పరిధిలో 56,226 క్వింటాళ్ల ధాన్యం రైతుల వద్ద ఉండటంతో తాము ఏంచేయాలో అంతుచిక్కటం లేదని అధికారులకు సమర్పించిన వినతిపత్రంలో స్పష్టం చేశారు. 2024-25 ఖరీఫ్‌కు సంబంధించి మిల్లర్లు తమ వద్ద ఎంటీయూ 1262రకాన్ని ఎఫ్‌సీఐ దగ్గర గత సంవత్సరకాలంలో సరిగా దిగుమతులు కాలేదని, బియ్యంలో పాయ వస్తుందని చెబుతున్నారని, మరికొంతమంది తమకు ఆర్వో రాలేదంటూ ఈ ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడానికి నిరాకరిస్తున్నారని స్పష్టం చేశారు. 1262రకం ధాన్యం రైతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆవినతిపత్రంలో కోరారు.

మిల్లర్లు పేచీ పెడుతున్నారు...

● గాలి శ్రీనివాసరావు, పూసలపాడు

పూసలపాడు సొసైటీ పరిధిలో రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో 1262సన్నరకం వరి పంటను ఎక్కువగా సాగుచేశారు. 1262రకం ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడానికి మిల్లర్లు పేచీ పెడుతున్నారు. గత నాలుగైదు రోజులుగా ఈధాన్యాన్ని తిరస్కరిస్తున్నారు. దిగుమతి చేసుకొనేలా చర్యలు తీసుకోవాలి.

'సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే శరణ్యం'



చంటి పిల్లలతో దీక్షకు హాజరైన ఉద్యోగి

కొత్తగూడెం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలుఐక్యంగా ఉద్యమించినప్పుడే పరిష్కారం అవుతాయని నాయకులు అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకొని సమస్యలపై స్పందించడం మానేసి ఉద్యమాలను, నీరుగార్చేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ సమ్మెలో ఉద్యోగులు చంటిపిల్లలతో, చిన్నారులతో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు దొడ్డా రవికుమార్, భూక్యా రమేష్, పద్మలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసంఘ జిల్లా అధ్యక్షుడు మోహన్, భట్టు చందర్‌లాల్, కిషన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య

ఏన్కూరు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, విత్తన దుకాణాలను సోమవారం జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తనిఖీ చేశారు. ఏన్కూరు తిమ్మరావుపేట, బురదరాఘవాపురం ఎరువుల దుకాణాలను సందర్శించారు. ఈసందర్భంగా లైసెన్సులను, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. లచ్చగూడెం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తాలు సరిపడా లేవని రైతలు జిల్లా వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లగా సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడి త్వరగా బస్తాలు వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు ఈకార్యక్రమంలో ఏవో నరసింహారావు, ఏఈవోలు బాలకృష్ణ, శ్రీకాంత్ తదితరులున్నారు.

గోదావరిలో యువకుడి మృతదేహం లభ్యం



పవన్ ప్రదీప్(ఫైల్)

భద్రాచలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి నిమజ్జన ఘాట్ వద్ద యువకుడి మృతదేహం లభ్యమైంది. వివరాల ప్రకారం.. భద్రాచలంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కట్టా పవన్ ప్రదీప్ (22) ఇంటర్ ఫెయిలై ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసైనట్లు తెలిసింది. ఈ క్రమంలో తల్లి మొబైల్‌ను తీసుకొని మందలించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రదీప్ ఈనెల13న గోదావరిలో దూకినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈవిషయం తెలియక అతని కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం అన్వేషించగా ఎక్కడ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు గోదావరి నదీ తీరంలో గాలించగా స్నానఘట్టాల వద్ద అతని మృతదేహం లభ్యమైంది. దీంతో మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. భద్రాచలం ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



19న కబడ్డీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జూనియర్ బాలురు, బాలికల విభాగంలో కబడ్డీ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి క్రిష్టఫర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 12-01-2005 తరువాత జన్మించి ఉండాలని, ఆసక్తి గల క్రీడాకారులు తమ, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	20 రూ.
వంకాయ	34
గుత్తి వంకాయ	40
బీరకాయ	58
పచ్చిమిర్చి	34
కాకరకాయ	38
బెండకాయ	40
పొట్లకాయ	38
దోసకాయ	28-38
చిక్కుడు	48
నాటుచిక్కుడు	110
గోరుచిక్కుడు	38
క్యాబేజీ	28
దొండ	46-50
సొరకాయ	26
క్యారెట్	58
క్యాప్సికం	64
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	పుష్ప 2
శ్రీనివాస:	పని
సాయిరాం:	మిస్‌యూ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	పుష్ప 2

డివిజన్	కార్పొరేటర్	సెల్‌నెంబర్
1	తేజావత్ హుస్సేన్	98485 29188
2	మలీదు వెంకటేశ్వర్లు	99497 01116
3	మలీదు జగన్	....
4	దండా జ్యోతిరెడ్డి	98669 25591
5	పల్లెబోయిన భారతి	95538 53111
6	నాగండ్ల కోటేశ్వరరావు	90630 12222
7	దొంగల సత్యనారాయణ	81065 01875
8	లకావత్ సైదులునాయక్	98483 81719
9	షేక్ జాన్‌బీ	77996 85786
10	చావా మాధురి	80968 64444
11	సరిపూడి రమాదేవి	99482 78404
12	చిరుమామిళ్ల లక్ష్మీ	98493 29742
13	కొత్తపల్లి నీరజ	98483 16224
14	కూరాకుల వలరాజు	99498 97577
15	రాపూరి కరుణ	92466 63945
16	మేడారపు వెంకటేశ్వర్లు	99126 44608
17	దనాల రాధా	95504 04444
18	మండదపు లక్ష్మీ	98480 18571
19	సీహెచ్ వెంకటనారాయణ	98485 88233
20	వీ ప్రశాంతలక్ష్మీ	98856 92345
21	ఆళ్ల నిరీశ	99487 14489
22	పల్లా రోశిలీనా	76599 87283
23	షేక్ మక్బూల్	98482 38953
24	కమర్తపు మురళీ	98859 74455
25	గోళ్ల చంద్రకళ	99495 29273
26	పునుకొల్లు నీరజ	94901 45220
27	దోడ్డా నాగేశ్వరరావు	88970 28299
28	గజ్జెల లక్ష్మీ	97019 23269
29	కొప్పెర సరిత	98489 41843
30	ముక్కల కమల	98483 04794
31	యర్రా గోపీ	77020 00447
32	జీనవాన్ సరస్వతి	96764 86370
33	తోటా ఉమారాణి	99511 25339
34	రుద్రగాని శ్రీదేవి	98496 34889
35	యల్లంపల్లి వెంకట్రావు	83282 18768
36	పసుమర్తి రామోహ్మన్‌రావు	98487 76665
37	షేక్ ఫాతిమాజోహారా	92465 55786
38	ఆలియా	98482 12872
39	మాధురి ప్రసాద్	98485 32871
40	దాడే అమృతమ్మ	96666 74646
41	కర్నాటి కృష్ణమూర్తి	99082 90555
42	పాకాలపాటి విజయనిర్మల	85001 65089
43	క్లైమెట్	98484 12449
44	పాలేపు విజయ	98669 25900
45	బుడిగెం శ్రీనివాస్	93993 70776
46	కర్నం వైష్ణవి	99668 66937
47	మాట్లేటి అరుణ	94403 58041
48	తోట గోవిందమ్మ	98480 15948
49	దుద్దుకూరి వెంకటేశ్వర్లు	98484 20471
50	రాపర్తి శరత్‌కుమార్	94940 43399
51	శీలంశెట్టి రమా	99492 28833
52	బుర్రి వెంకటేశ్వర్లు	99895 70941
53	పగడాల శ్రీవిద్య	94400 05558
54	మిక్కిలినేని మంజు	93969 66478
55	మోతారపు శ్రావణి	82975 49999
56	పగిడిపల్లి రోహిణి	98485 89580
57	మహ్మద్ రఫీదాబేగం	94901 88786
58	దోరేపల్లి శ్వేత	99639 07909
59	బట్టపోతుల లలితారాణి	81878 71700
60	బడ్డే నిరంజన్‌కుమార్	99667 72453



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఇందిరమ్మ సర్వేకు వినతుల వెల్లువ

▸ ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన మేయర్ నీరజ

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అధికారుల స్థానంలో ప్రజాప్రతినిధి వినతులు స్వీకరించిన అరుదైన సంఘటన ఖమ్మం నగర పాలకసంస్థలో చోటు చేసుకొంది. సోమవారం ఖమ్మం నగర పాలకసంస్థ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అయితే కమిషనర్ అభిషేక్ ఆగస్త్య హాజరు కాకపోవటంతో మేయర్ పునుకొల్లు నీరజ ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు తమ నివాసాలకు ఎవ్వరు రాలేదని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఖమ్మం నగరంలోని అన్ని ప్రాంతల మహిళలు ఇందిరమ్మ సర్వే కోసం మరోసారి పరిశీలన చేయాలని అధికారులను కోరారు. మధ్యాహ్నం 3గంటల వరకు కేఎంసీ కంప్యూటర్ ఆపరేటర్లు వద్దకు ఆధార్‌కార్డులతో వెళ్లిన మహిళలు తమ పేర్లు పరిశీలించుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల వినతులపై మేయర్ స్పందించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. సర్వే ఇంకా కొనసాగుతుందని అన్నారు. కాగా మున్నేరు బాధితులకు పరిహారం, తాగునీటి సమస్యలపై ఎక్కువ వినతులు అందాయి.

రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలి

▸ సీపీఎం అనుబంధ తెలంగాణ రైతుసంఘం డిమాండ్

నేలకొండపల్లి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రూ.2లక్షల రుణమాఫీని ఖచ్చితంగా అమలు చేయాలని, రుణం తీసుకున్న ప్రతి రైతుకూ వర్తింపచేయాలని సీపీఎం అనుబంధ తెలంగాణ రైతుసంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతుసంఘంనాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చా నర్సింహారావు మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీకనుగుణంగా షరతులు లేకుండా రుణమాఫీని వెంటనే చేయాలని డిమాండ్ చేసారు. రైతు రుణమాఫీ పూర్తై పోయిందని ఓవక్క ప్రభుత్వం ప్రకటిస్తున్నదని, కానీ ఇంకా 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్న విషయాన్ని ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వం మభ్యపెడుతున్నదన్నారు. ఇటీవల మహాబూబ్‌నగర్‌లో నిర్వహించిన రైతు పండగ సభలో రైతు రుణమాఫీ నూరు శాతం పూర్తైపోయిందని ముఖ్యమంత్రి ప్రకటించారని, మాఫీ జాబితాల్లో పేర్లున్న రైతులకు సైతం నేటివరకు మాఫీ సొమ్ము ఖాతాల్లో జమకాలేదన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం అనుబంధ రైతుసంఘం నాయకులు



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

బాల సదనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

▸ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బాల సదనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, దీనికి సంబంధించిన పనులను పకడ్బందీగా అధికారులు పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టర్ నగరంలోని బాలసదనం భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలల సదనంలో చేపట్టాల్సిన మరమ్మతులు, పిల్లలకు ఆహ్లాదం కోసం కల్పించాల్సిన ఆట పరికరాల పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సదనంలోని స్థలంలో ఉన్న బండలను తొలగించి భూమి చదును చేయాలని అధికారులకు తెలిపారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే దిశగా ఉయ్యాల, జారుడు బండ, షటిల్ కోర్ట్ వంటి వివిధ ఆటలకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవనం గోడలపై ఆకర్షణీయమైన పెయింటింగ్స్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, బాల సదనం సూపరింటెండెంట్ వరలక్ష్మి, సంబంధిత అధికారులు ఉన్నారు.

చచ్చినా కష్టాలే..

▸ అంత్యక్రియల సమయంలో తరచూ ఘర్షణలు
▸ శ్మశాన వాటికలకు సరైన హద్దులు లేని ఫలితం..
▸ విలీన పంచాయతీల్లో అధికం..
▸ తాజాగా గొల్లగూడెంలో వివాదం

ఖమ్మంటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని గొల్లగూడెంలో సోమవారం అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని తేగా, సదరు స్థలం పట్టాభూమి అని ఒక వ్యక్తి అంత్యక్రియలను అడ్డుకున్నారు. దాంతో ఊరిలోని వారంతా రాగా, సదరు వ్యక్తి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు తీవ్ర వాగ్వాదం జరిగింది. చివరకు పెద్ద మనుష్యులు జోక్యం చేసుకోవటంతో వారి సమక్షంలో వివాదం సద్దుమణిగి, అంత్యక్రియలు నిర్వహించారు. నగరపాలకసంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇలానే శ్మశానవాటికల వద్ద తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. అంత్యక్రియలు నిర్వహించాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.

పలు ప్రాంతాల్లో ఘర్షణలు

శ్మశానవాటిక విషయంలో పలు ప్రాంతాల్లో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. దీనికి కారణం శ్మశానవాటికకు ఎంత స్థలం కేటాయించారో సరైన వివరాలు లేవు. అంతేకాకుండా శ్మశానవాటికలకు హద్దులు నిర్ణయించి, ఫెన్సింగ్ చేయటం లేదు. ఎప్పుడో దశాబ్దాల క్రితం శ్మశానవాటికకు స్థలం కేటాయించి వదిలేశారు. ఇటీవల భూముల ధరలు పెరగటంతో అక్రమార్కుల దృష్టి సదరు శ్మశాన వాటికల స్థలంపై పడ్డది. దీంతో సదరు భూమి తమ పట్టాభూమి అని అంత్యక్రియలకు అనుమతివ్వమంటూ అడ్డుకుంటున్నారు. అధికారులు ఈ విషయమై సర్వే చేయటం లేదు. శ్మశానవాటికకు కేటాయించిన స్థలాలు ఎన్ఎస్‌పీ, ఆర్‌అండ్‌బీ, పూర్వ పంచాయతీకి సంబంధించినవి కావటంతో కేవలం రెవెన్యూ అధికారులు మాత్రమే సర్వే చెయ్యలేకపోతున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సర్వే చేయాల్సి ఉంటున్నది. ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, ఆయా శాఖల అధికారులు స్పందించకపోవటంతో అంత్యక్రియల సమయంలో వివాదాలు జరిగి, ఉద్రిక్తత నెలకొంటున్నది. ముఖ్యంగా నగరపాలకసంస్థలో విలీనమైన గ్రామ పంచాయతీల్లో వివాదాలు జరుగుతున్నాయి.

తాజాగా గొల్లగూడెంలో...

తాజాగా సోమవారం గొల్లగూడెంలో అంత్యక్రియల విషయంలో వివాదం జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. అక్కడ ఉన్న శ్మశానవాటికలో పూర్వంనుంచి తాము అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని గ్రామస్థులు చెబుతుండగా, సదరు స్థలం తమ పట్టాభూమి అని ఒక వ్యక్తి చెబుతున్నాడు. ఈ నేపథ్యంలో అంత్యక్రియలు జరుగుతుండగా, అభ్యంతరం వ్యక్తం చేయగా, ఇరువర్గాలకు వాగ్వాదం జరిగి ఉద్రిక్తత నెలకొంది. కాగా గతంలో కొత్తగూడెంలో శ్మశానవాటిక విషయంలో వివాదం జరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

ఇటీవలనే టేకులపల్లిలో కూడా శ్మశానవాటిక విషయంలో ఘర్షణ జరిగింది. తాజాగా గొల్లగూడెంలో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి, వివాదంలో ఉన్న శ్మశానవాటికలకు హద్దులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గొల్లగూడెంలో శ్మశానవాటిక వద్ద వాగ్వాదం

సెల్‌ఫోన్ చోరీ.. వ్యక్తి అరెస్టు

ఖమ్మం క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ చోరీ చెసిన వ్యక్తిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి సోమవారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. సత్తుపల్లికి చెందిన గోద శ్రీనివాసరావు అనే వ్యక్తి పనిపై ఖమ్మం వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు నగరంలోని పాత బస్‌స్టాండ్‌కు వెళ్లాడు. అక్కడ బస్సు ఎక్కుతుండగా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన బండి సత్యనారాయణ సెల్‌ఫోన్‌ను చోరీ చేసి వెళ్లి పోయాడు. తన ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితుడు శ్రీనివాసరావు వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. వారు సీసీ కెమేరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు రోహిత్ శర్మ



కామేపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన వంగవరపు రోహిత్‌శర్మ ఎంపికయ్యాడు. పండితాపురం గ్రామానికి చెందిన వంగవరపు రోహిత్‌శర్మ పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 13,14,15వ తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. బౌలింగ్, బ్యాటింగ్‌లో ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 26నుంచి 30వరకు ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లాలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపాడు. ఆగా రోహిత్‌శర్మ తండ్రి శర్మ పండితాపురం సాయిబాబా ఆలయంలో పురోహితుడిగా పని చేస్తున్నారు.

రైతు రుణ మాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం

▸ తెలంగాణ రాష్ట్రరైతు సంఘం ఏఐకేఎస్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన దృశ్యం

కామేపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతుల రుణ మాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏఐకెఎస్ మండల కార్యదర్శి శతకోటి సత్యనారాయణ అన్నారు. సోమవారం కామేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

టైప్ రైటింగ్ పరీక్ష కేంద్రాన్ని మార్చొద్దు

▸ ఖమ్మంలోనే కొనసాగించాలని డిమాండ్

ఖమ్మం ఖానాపుంహవేలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో సాంకేతిక విద్యాశాఖ గత 50 ఏళ్ల నుంచి ఉన్న టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్ష కేంద్రాన్ని మార్చడంపై విద్యార్థులు, అధ్యాపకులు ఆందోళన నిర్వహించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి జరిగే సాంకేతిక విద్య టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలకు సుమారు 600 మంది హాజరవుతుంటారు. కాగా ఖమ్మం నగరంలో పాలిటెక్నిక్ కళాశాల లేదనే సాకుతో పరీక్ష కేంద్రాన్ని మార్చారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఉన్నప్పటికీ ఎగ్జామ్ సెంటర్‌ను మధిరకు మార్చారని తెలిపారు. పరీక్షల కోసం నగరం నుంచి 40 కి.మీ. దూరంలోని మధిరకు వెళ్లడం ఇబ్బందిగా ఉంటుందని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే ఖమ్మంలోని పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలని కోరారు.

రుద్రాక్ష ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకుడు దుర్గాప్రసాద్

ఖమ్మం చర్చికాంపౌండ్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని బైపాస్‌రోడ్‌లోని త్రిబుల్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం రుద్రాక్ష ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకముఖి నంచి 21ముఖాల వరకు రుద్రాక్షలు అత్యంత అరుదైన సిద్ధిమాల, కరంగళి మాలలు, జాతిరత్నాలు, స్పటిక, నవరత్నాలు లభిస్తాయని తెలిపారు. ఈరుద్రాక్షలు ఎంతో శక్తివంతమైనవని, రుద్రాక్ష గొప్పతనం ఎవరు సిఫారసు చేయనవసరం లేదని, ఇవి ధరిస్తే మంచి జరుగుతుందని తెలిపారు. ఈఎగ్జిబిషన్‌ను నేటి ఈనెల 21వ తేదీ వరకు ఆరు రోజులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తిరుమలాయపాలెం ఎస్ఐ జగదీష్‌కు రివార్డు

తిరుమలాయపాలెం, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం ఎస్‌ఐగా విధుల నిర్వహిస్తున్న కూసుపుడి జగదీష్‌కు సీపీ సునిల్‌దత్ రివార్డు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న వృద్ధ దంపతుల హత్యకేసులో నిందితులను పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించినందుకు ఎస్‌ఐకు రివార్డు అందించారు. నేలకొండపల్లికి చెందిన వెంకటరమణ, కృష్ణమూర్తి వృద్ధ దంపతులు నవంబరు 26న హత్యకు గురయ్యారు. దీంతో నిందితులను పట్టుకునేందుకు సీపీ ఆదేశాల మేరకు రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఈకేసును సవాల్‌గా తీసుకుని నిందితుల కోసం నాలుగు బృందాలు ఏర్పాటుచేశారు. ఈమేరకు తిరుమలాయపాలెం ఎస్‌ఐ జగదీస్, సిబ్బంది వీరస్వామి, కిషన్, ప్రసాద్, శ్రీనివాస్‌తో కలిసి నిందితులకోసం ముమ్మరంగా వేట ప్రారంభించారు. నిందితులను పట్టుకున్నందుకుగాను ఎస్సైతో పాటు సిబ్బందికి రివార్డు అందించారు.



జగదీష్‌కు రివార్డు అందజేస్తున్న సీపీ

రోడ్డు విస్తరణతో.. కష్టం వచ్చింది..

▸ కలెక్టర్‌ను కలిసిన వనజీవి దరిపల్లి రామయ్య దంపతులు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ‘ అయ్యా.. రోడ్డు విస్తరణ పనులతో నా ఇల్లు కూల్చాల్సి వస్తోంది.. ఉన్న ఒక్కగానొక్క గది కూలిపోతుందని బాధగా ఉంది..’ అని పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి దరిపల్లి రామయ్య దంపతులు వాపోయారు. సోమవారం దరిపల్లి రామయ్య దంపతులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ని కలిశారు. అయ్యా..! రోడ్డు విస్తరణలో నా ఇల్లుపోతోంది. నేను ఉండేందుకు ఓ ఇల్లు మంజూరు చేయండయ్యా అంటూ వేడుకున్నారు. రోడ్డు విస్తరణ వల్ల అనేక మందికి రవాణా పరంగా మంచే జరుగుందని, అభివృద్ధిని స్వాగతించాలని అన్నారు. రామయ్య వినతిపై స్పందించిన కలెక్టర్ గృహనిర్మాణ శాఖ అధికారులను తగిన చర్యల కోసం ఆదేశించారు. దీంతో ఆ దంపతులు తిరిగి వెళ్లిపోయారు.



కలెక్టర్‌ను కలిసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత దరిపల్లి రామయ్య దంపతులు

బస్టాండ్‌ను ఉపయోగంలోకి తేండి..

▸ అధికారులను కోరిన ఇఫ్టూ నాయకులు



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రామదాసు, భిక్షం

నేలకొండపల్లి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా ఉపయోగంలోకి తేవాలని ఇఫ్టూ నాయకులు అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. లక్షల వ్యయంతో నిర్మించిన బస్టాండ్ కొన్ని సంవత్సరాలుగా ఉపయోగంలేకుండా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకుడు రామదాసు, చిర్రా భిక్షం, పిచ్చయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషిచేయాలి

▸ డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి బాయి



ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం కోసం బాధ్యులంతా కృషిచేయాలని, ఆరోగ్యవంతమైన సమాజం ద్వారానే దేశ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి బాయి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బాలకృష్ణ అన్నారు. ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో స్కూల్ హెల్త్ అండ్ వెల్నెస్ ప్రోగ్రాం పై రెండు రోజుల జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్‌ల శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌వో సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమం చాలా ప్రాధాన్యం కలిగిన అంశమని, దీన్ని విజయవంతం చేయటానికి అందరూ సహకరించాలని కోరారు. జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి యలగందుల రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పూర్తయిందని ప్రస్తుతం రెండు రోజులు పాటు ప్రతి మండలం నుంచి వైద్య ఆరోగ్య శాఖ నుంచి నలుగురు జిల్లా విద్యాశాఖ నుంచి నలుగురు ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొన్న వారు జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్‌గా మండల స్థాయిలో శిక్షణ ఇవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ చందన, డాక్టర్ స్రవంతి, డాక్టర్ బాలకృష్ణ, పెసర ప్రభాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కట్ల రంగారావు

అండర్ బ్రిడ్జి కోసం ఎదురు చూపులు

» రెండు రాష్ట్రాల సరిహద్దు గ్రామ ప్రజలకు తీరని కల

» రైల్వేగేటు వద్ద గంటల తరబడి వాహనదారుల పడిగాపులు



రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం

బోనకల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బోనకల్ మండలంలో రెండు రాష్ట్రాల సరిహద్దు గ్రామంగా పేరున్న గోవిందాపురం(ఎ) గ్రామం గుండా తెలంగాణతో పాటు ఆంధ్రా ప్రాంతానికి రాకపోకలు సాగించేందుకు రోడ్డు మార్గాలు ఉన్నాయి. రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని ప్రజలు దశాబ్దాల తరబడి ఎదురు చూస్తున్నారు. ఈ గ్రామం నుంచి 12 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే ఎన్టీఆర్ జిల్లా పెనుగ్రంచిప్రోలు దేవస్థానానికి చేరుకోవచ్చు. అదే విధంగా అక్కడ నుంచి గోవిందాపురం(ఎ) మీదుగా ఆంధ్రావాసులు నెమలి దేవస్థానానికి తక్కువ దూరం ప్రయాణంతో చేరుకోవచ్చు. బ్రిటీష్ పాలనా కాలంలో ఏర్పాటు చేసిన రైల్వే గేటు గ్రామం మధ్యలో ఉంది. దీని వలన ఊరు రెండుగా చీలింది. దీంతో గేటు అవతల ప్రాంతంలో ఉన్న ప్రజలు అవసరాల కోసం గ్రామం దాటాలంటే నరకయాతన పడుతున్నారు. గంటల తరబడి గేటు వేసి ఉండటం వలన అత్యవసర వైద్యానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. మూడవ రైల్వే ట్రాక్ పనులు జరుగుతుండటంతో మూసి ఉన్న గేటు వద్ద వాహనాలు నిలిచిపోతున్నాయి. గేటు వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రజలు రైల్వే అధికారులు, మంత్రులను కలిసి వినతి పత్రాలను అందజేస్తున్నారు. అండర్ బ్రిడ్జి నిర్మాణం కేంద్ర పరిధిలో అంశం కావడంతో రెండు రాష్ట్రాల సరిహద్దు గ్రామ ప్రజలకు ఈ సమస్య తీరని కలగా మారింది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అండర్ బ్రిడ్జిని నిర్మించాలి

●బాగం పాపారావు, గోవిందాపురం(ఎ)



అండర్ బ్రిడ్జి లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో గ్రామం నుంచి బయటకు వెళ్లడానికి గేటు వలన ఏళ్ల తరబడి బాధలను అనుభవిస్తున్నాం. రెండు రాష్ట్రాల నుంచి ప్రముఖ దేవస్థానాలకు రాకపోకలు సాగించడానికి గ్రామం మధ్యలో అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే రవాణా సౌకర్యం మెరుగ్గా ఉంటుంది.

ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి అండర్ బ్రిడ్జికి నిధులు మంజూరు చేసి సమస్యను తీర్చాలి.

కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి

» టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు

వైరా, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని సూచించారు. సోమవారం వైరాలో కాల్వ సుజాత అభిమానసంఘం, మున్నూరు కాపుసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తన జన్మదిన వేడుకల కేక్‌ను రంగారావు కట్‌చేశారు. ఆయనకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏడాది కాలంలోనే 25 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం, కట్ల సంతోష్, నాగరాజు, ముదిగొండ్ల మహేష్, మాదినేని ప్రసాద్, లక్ష్మణ్, సత్యనారాయణ, నాగేశ్వరరావు, సత్యం, సైదులు, శ్రీకాంత్, సతీష్, విశ్వనాథం ప్రవీణ్ పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

కొణిజర్ల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. రెండవ రోజు మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాలలో 2,376 మంది అభ్యర్థులకు ఉదయం 1,249 మంది హాజరుకాగా, మధ్యాహ్నం 1247 మంది హాజరయ్యారు. పరీక్షాకేంద్రాల వద్ద పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. కాగా పరీక్షలకు అభ్యర్థులు తక్కువగా హాజరయ్యారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వైరా, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దొరికిన సెల్‌ఫోన్‌ను బాధితురాలికి ట్రాన్స్‌కో లైన్ మన్ కర్లకంటి శ్రీనివాసరావు అప్పగించారు. వైరా మునిసిపాలిటీ బ్రాహ్మణపల్లి అగ్రహారానికి చెందిన ఓ మహిళ చేతిలో రూ.15వేల విలువైన సెల్‌ఫోన్‌ను రోడ్డుపైన జారవిడుచుకుంటుంది. విధి నిర్వహణలో శ్రీనివాసరావుకు ఆసెల్‌ఫోన్ దొరికింది. వెంటనే సెల్‌ఫోన్ ఆధారంగా బాధితురాలి ఆచూకీ తెలుసుకొని పోలీస్ కానిస్టేబుల్ విజయ్ సమక్షంలో సోమవారం బాధితురాలికి అందజేశారు.

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

» జీఎం (ఆర్‌డీ) ఆర్.నారాయణరావు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): గనిలో రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించి సంస్థ అభ్యున్నతికి దోహదపడాలని కమిటీ కన్వీనర్, జీఎం (ఆర్‌డీ) ఆర్.నారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని కిష్టారం ఓసీలో రక్షణ వారోత్సవ కమిటీ సభ్యులు పర్యటించారు. అనంతరం ట్రేడ్ టెస్ట్ గెలుపొందిన ఉద్యోగులను అభినందిస్తూ బహుమతులను అందజేశారు. బ్లాస్టింగ్‌పై నాటికను ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. కార్యక్రమంలో పీవో ఎంవీ.నరసింహారావు, కమిటీ సభ్యులు సునీల్‌వర్మ, వీ.రామకృష్ణ, లక్ష్మీరాజు, ఏ.భాస్కర్, పీ.లోక్‌నాథ్‌రెడ్డి, టీ.శ్రీరామ్, తిరుపతి, కిషణ్ రెడ్డి, శ్రావణ్‌కుమార్, పీఈ రమణారావు, మేనేజర్ రామకృష్ణ, రక్షణాధికారి గోపీకిషోర్, సంక్షేమాధికారి విజయ్‌సందీప్‌లు పాల్గొన్నారు.

'సామాజిక తనిఖీతో పారదర్శకత సాధ్యం'

సత్తుపల్లిరూరల్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): సామాజిక తనిఖీ ద్వారా జవాబుదారితనం, పారదర్శకత సాధ్యమవుతుందని సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ సాంబశివచారి అన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి 14వరకు మండలంలోని గ్రామాల్లో సోషల్ ఆడిట్‌ను అధికారులు నిర్వహించారు. మండలంలోని 21గ్రామ పంచాయితీలలో ఖర్చు చేసిన రూ.3కోట్ల నిధులపై తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. కూలీలు, వేతనాలు, బిల్లుల పరంగా సోషల్ ఆడిట్ జరుగుతుండగా నేడు కిష్టారం, నారాయణపురం, గౌరిగూడెంలో మొదటి విడత గ్రామసభలు పూర్తవ్వనున్నట్లు ఈజీఎస్ ఏపీవో ఎం.బాబు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, పాల్గొన్నారు.

కాంటా వేసిన ధాన్యాన్ని ఎగుమతి చేయాలి

వేంసూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలంలో సాగు చేసిన ఎంటీయూ 1,262రకానికి సంబంధించి ధాన్యాన్ని కాంటా వేసినప్పటికీ మిల్లర్లు తిరస్కరిస్తుండటంతో ఆధాన్యాన్ని ఎగుమతి చేయటం లేదని వెంటనే ధాన్యాన్ని ఎగుమతి చేయాలని కోరుతూ రైతులు సోమ వారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 40కిలోల బస్తాకు కేజిన్నర తరుగు తీస్తేనే తమ ధాన్యాన్ని ఎగుమతి చేస్తామని మిల్లర్లు ఆంక్షలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి 1,262రకం ధాన్యాన్ని ఎగు మతి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆవినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొత్తా సత్యనారాయణ, అర్వపల్లి వెంకటేశ్వరరావు, బొంతు భాస్కర్‌రావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం పోరాటం చేస్తాం

» సీపీఎం జిల్లా నాయకుడు బొంతు రాంబాబు

తల్లాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని ఆపార్టీ జిల్లా నాయకుడు బొంతు రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని నూతనకల్ గ్రామంలో ఆపార్టీ సీనియర్ సభ్యుడు వంగూరి మోషయ్య సంతాపసభలో ఆయన మాట్లాడుతూ రైతులు, నిరుద్యోగులు, వ్యవసాయ కార్మికులు, మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు మాదినేని రమేష్, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, కల్యాణం కృష్ణయ్య, నల్లమోతు మోహన్‌రావు, సత్తెనపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్యను పెంచాలి

» పీవోడబ్ల్యూ రాష్ట్ర కోశాధికారిగా ఝాన్సీ

వైరా, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సంఖ్యకనుగుణంగా ఆర్టీసీ బస్సులను పెంచాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర కోశాధికారిగా టీ.ఝాన్సీ డిమాండ్ చేశారు. సోమవారం వైరాలో జరిగిన పీవోడబ్ల్యూ డివిజన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం హర్షణీయమన్నారు. అయితే ఇటీవల 3వేల ఆర్టీసీ బస్సులను ఉన్నపళంగా తగ్గించి వేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మోదుగు లాలమ్మ, వరికూటి మరియమ్మ, యలదండి సుభద్ర పాల్గొన్నారు.

ప్రజావాణి కార్యక్రమానికి అధికారుల గైర్హాజర్

కారేపల్లి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యాక్రమానికి పలుశాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలు తమకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకునేందకు దుర్రాప్రాంతాల గ్రామాల నుంచి వస్తున్నారు. ప్రజలు వచ్చే సమయంలో సంబంధిత అధికారులు లేకపోవడంతో ఊసురుమంటూ తిరిగి వెళ్లిపోతున్నారు. హాజరు కాని అధికారులపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

బీబీసీకి తగ్గిన నీటి సరఫరా

» ఆందోళనలో రైతులు



తక్కువ నీటి సరఫరా జరుగుతున్న దృశ్యం

బోనకల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీబీసీ (బోనకల్ బ్రాంచ్ కెనాల్)కి నీటి సరఫరా తగ్గిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండురోజులుగా బీబీసీకి 150క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా అవుతుండడంతో కాల్వల చివరి భూములకు నీరందడం లేదు. బీబీసీ పరిధిలో వేలాది ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. బీబీసీకి 450క్యూసెక్కుల నీటి సరఫరా నిరంతరం జరిగితే కాల్వల కింద సాగు చేసిన చివరి భూముల వరకు నీటి తడులు అందుతాయి. నీటి సరఫరా తగ్గుదల వల్ల చివరి భూముల రైతులు నీరందక నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బీబీసీకి నీటి సరఫరా తగ్గకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు

» అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో సైదులు

ముదిగొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు సిబ్బందికి సూచించారు. సోమవారం ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మధుసూదన్‌రావు, ఫార్మాసిస్టు సత్యావతి, స్టాఫ్‌నర్సు నాగరాజకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ రామారావు పాల్గొన్నారు.

భట్టితోనే మధిర అభివృద్ధి : మల్లు నందిని



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నందిని

మధిరటౌన్, డిసెంబరు16: మధిర పట్టణం లో అభివృద్ధి జరిగిందంటే ఆనాడు డిప్యూటీ స్పీకర్‌గా, నేడు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రిగా ఉన్న మీ శాసనసభ్యుడు మల్లు భట్టి విక్రమార్క వల్లే జరిగిందని అని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. సోమవారం రాత్రి మధిరలోని హనుమాన్ కాలనీ, ముస్లిం కాలనీ లలోని వివిధ పార్టీల నుంచి కౌన్సిలర్ మల్లాది వాసు, సవితల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన 50 కుటుంబాల వారికి ఆమె కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు నడవటానికి వీలు లేనటువంటి హనుమాన్ కాలనీ, ముస్లిం కాలనీలకు మొట్ట మొదట రోడ్లు వేసింది భట్టినేనని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మిరియాల రమణగుప్త, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్‌రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు దుంపా వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు మునుగోటి వెంకటేశ్వరరావు, గద్దల మాధురి, మాధవి మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, కర్నాటి రామారావు పాల్గొన్నారు.

మధిర రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం నిధానపురం గ్రామంలో 23 మంది స్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ బాధా కృష్ణారెడ్డి, మూర్తి గురుస్వామి(తిరువూరు) ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇరుముడి కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సూరంశెట్టి కిషోర్, మల్లాది వాసు, పాటిబండ్ల సత్యంబాబు, కర్నాటి రామారావు, నిడమానూరి వంశీ, అద్దంకి రవికుమార్, దుంపా వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులను సక్రమ మార్గంలో నడిపించాలి

» మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్

సత్తుపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరిస్తూ వారు చేసే పనులను గమనిస్తూ సక్రమ మార్గంలో నడిపించే బాధ్యత వారిదేనని మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. సోమవారం స్థానిక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మానాన్నలకు వందనం అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. నీరుడు నాగేశ్వరరావు, ఏఎంవో కే.రవికుమార్, ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, ఏఐపీసీ చైర్మన్ పద్మ పాల్గొన్నారు.

సీపీఎం సభలకు కార్యకర్తలు తరలిరావాలి

» సీపీఎం జిల్లా నాయకుడు మాదినేని రమేష్

కల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) సత్తుపల్లిలో ఈ నెల 18,19న జరగనున్న సీపీఎం22వ జిల్లా మహాసభలకు కార్యకర్తలకు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు మాదినేని రమేష్ పిలుపు నిచ్చారు. సోమవారం కల్లూరులో జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారారణరెడ్డి, డివిజన్ కమిటీ సభ్యుడు తన్నీరు కృష్ణార్జునరావు, మండల నాయకులు గంపల శ్రీనువాసరావు, తన్నీరు కృష్ణవేణి తదితరులున్నారు.

మండలంలో ఇసుక ర్యాంపులు ప్రారంభం

ఎర్రుపాలెం, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఇసుక ర్యాంపుల నుంచి ఇసుకను తోలుకునేందుకు ఇసుక ర్యాంపులను తహసీల్దార్ మన్నె ఉషాశారద సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచన మేరకు కలెక్టర్ ఆదేశాలతో ఇందిర క్రాంతి పథకం మహిళల స్వయం సహాయక సంఘాల ద్వారా గృహ అవసరాలకు ఇసుకను కొనుగోలు చేసుకునేందుకు ప్రజలకు అవకాశం కలిపిస్తున్నామన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింప చేయాలి

» తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రైతు సంఘం, సీపీఐ నాయకుల ధర్నా



వైరాలో రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు



ఏన్కూర్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ఏన్కూరు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులదంరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు జాగర్లముడి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అమరనేని వీరభద్రం, మాదినేని వెంకన్న, బోగినబోయిన నాగేశ్వరరావు, నరసింహారావు, బసవయ్య, రమేష్, యల్లయ్య, బాలకృష్ణ, పాల్గొన్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రైతులకు పూర్తిస్థాయిలో అర్హులైన రైతులకు రుణమాఫీని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, తాతా వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, ఉంగారాల సుధాకర్, బట్టు సంగయ్య వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైరాలో....

వైరా, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ రుణమాఫీ చేయాలని, రైతుభరోసా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ డిమాండ్ చేశారు. ఆసంఘం ఆధ్వర్యంలో సోమవారం వైరా రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రావి శివరామకృష్ణ, వెంకటేశ్వర్లు, బండారుపల్లి ముత్తయ్య, దొబ్బల కృష్ణ, కొండా రామకృష్ణ, మిట్టపల్లి రాఘవరావు, గారపాటి అశోక్, కొండా పాల్గొన్నారు.

కొణిజర్లలో....

కొణిజర్ల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రైతులకు రైతు భరోసా ఊసేలేదని తక్షణమే వాటిని అమలు చేయాలని సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రాబాబు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పివిరావు, స్వర్ణ రమేష్, తోటపల్లి సీతరాములు, తండు సోమయ్య, గడల శ్రీను, కొమ్మిని వెంకయ్య, సైదులు, పుల్లయ్య, దడిపిన్ని వెంకటేశ్వర్లు, నరసింహరావు పాల్గొన్నారు.

తల్లాడలో...

తల్లాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రైతుసంఘం, సీపీఐ జిల్లా నాయకులు నల్లమోతు నర్సింహారావు, మద్దోజు శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తల్లాడ రెవెన్యూ కార్యాలయం వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఓర్సు రమేష్, నాయకులు తమ్మారపు వెంకటేశ్వర్లు, రాయప్ప, కృష్ణ పాల్గొన్నారు.

చింతకానిలో...

చింతకాని, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా తక్షణమే అమలుచేయాలని తెలంగాణ రాష్ట్రరైతు సంఘం, సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జమ్ముల జితెందర్‌రెడ్డి, మడిపల్లి గోపాలరావు, కొండపర్తి గోవిందరావు, వేపూరి రవీంద్రబాబు, కూచిపూడి రవి, పావులూరి మల్లికార్జున్, రాచబంటి రాము, వత్సవాయి జానకిరాములు పాల్గొన్నారు.

బోనకల్‌లో...

బోనకల్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆసంఘ జిల్లా కార్యదర్శి జక్కుల రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో తోట రామాంజనేయులు, యంగల ఆనందరావు, పవన్, వెంకటేశ్వర్లు, కృష్ణ, నాగయ్య, జయరాజు పాల్గొన్నారు.



కొణిజర్లలో వినతి పత్రం అందిస్తున్న నాయకులు



తల్లాడలో తహసీల్దార్ వనజకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



చింతకానిలో......

ధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణ దీక్ష ప్రారంభం



రేజర్ల ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా మండలంలోని రేజర్లలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం, బేతుపల్లిలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాలలో సోమవారం ధనుర్మాసవ్రత ప్రయుక్త శ్రీ కృష్ణ దీక్షను 80మంది స్వీకరించారు. అనంతరం ఆధ్యాత్మిక వేత్త, ఉపన్యాస రత్న శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి మాట్లాడారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు మందపాటి కేశవరెడ్డి, నున్నా రాంబాబు, గజేంద్రరావు, ఎల్లయ్య, ఒగ్గు పుల్లారెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డి, వెంకటరామిరెడ్డి, వసంత లక్ష్మి, గొర్ల శ్రీనివాసరెడ్డి, కృష్ణస్వామి, రామారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కళతప్పిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్



వాటర్ పౌంటేన్‌లో సేద తీరుతున్న గేదె

మధిరటౌన్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మధిరలో గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నేడు కళ తప్పింది. గత శాసన సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడటానికి కొద్ది రోజుల ముందు హడావుడిగా పనులు చేసి ప్రారంభించారు. ఆ తరువాత మార్కెట్ ఆలనా పాలనను ఎవరు పట్టించుకోకపోవడంతో పరిసరాలు అన్నీ కళాహీనంగా మారాయి. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వాటర్ పౌంటేన్ ప్రారంభించిన కొన్నాళ్లకే మరమ్మతులకు గురైంది. అది నేడు గేదెలకు ఆవాసంగా మారింది. మార్కెట్ ముందు వేసిన లైట్లు కూడా రాత్రి సమయంలో వెలగడం లేదు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.